బుధవారం
WEDNESDAY
14-10-2026

సంపుటి (Volume):2 ‖ సంచిక: (Issue): 106

జగిత్యాల JAGITIAL ‖ పేజీలు: (PAGES):12 వెల (PRICE): 2.00

Circulated to Telangana
Published from Jagitial

PRGI REGD NO: TGTEL/25/A1385

www.evarthalu.com

నేటి ఈవార్తలు

EVARTHALU దినపత్రిక

అట్ల బతుకమ్మ శుభాకాంక్షలు





ఒక్కొక్కరికి రూ.1.53 లక్షలు

సింగరేణి కార్మికులకు దసరా బోనస్

పర్మినెంట్ కార్మికులకు లాభాల్లో 34 శాతం వాటా

పండుగకు ముందే ఖాతాల్లో బోనస్ జమ

రామగుండం, అక్టోబర్ 13 (ఈవార్తలు): దసరా పండుగ వేళ సింగరేణి కార్మికులకు తీపి కబురు అందింది. సంస్థలో పనిచేస్తున్న శాశ్వత కార్మికులతో పాటు కాంట్రాక్టు -2 వ పేజీలో.



దీపావళి తర్వాతే ఎండీఆర్

చార్జీల వడ్డన

న్యూఢిల్లీ: పండుగల సీజన్ నేపథ్యంలో వ్యాపార లావాదేవీలకు అంత రాయం కలగకుండా ఉండాలనే ఉద్దేశంతో ఎంపిక చేసిన యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) చార్జీలను నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) దీపావళి తర్వాత అమలు చేస్తామని పేర్కొంది. గతంలో నిర్ణయించిన తరువాయి 2 వ పేజీలో.

బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

గ్రాము-24 క్యారెట్స్):	రూ.14,968
వెండి (కిలో):	రూ.2,45,000
ప్లాటినం (గ్రాము):	రూ.5,233

విశ్వవాణి



సెలియాక్ వ్యాధితో బాధపడేవారికి ప్రయాణాల్లో ఆహారం విషయంలో ఎదురయ్యే ఇబ్బందులను తొలగించేందుకు 2028లో ప్రత్యేక క్రూయిజ్ ప్రయాణం నిర్వహించనున్నారు. ఓషియానా విస్తా నౌకలో జరిగే ఈ ప్రయాణంలో ఇంగ్లండ్, ఐర్లాండ్, స్కాట్లాండ్ ప్రాంతాలను సందర్శిస్తారు. నౌకలోని మొత్తం 11 రెస్టారెంట్లలో పూర్తిగా గ్లూటెన్ రహిత ఆహారమే అందించనున్నారు. ఇటాలియన్, స్టీక్‌హౌస్, ఫ్రెంచ్, ఆసియా వంటకాలతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం, పూల్‌సైడ్ డైనింగ్ వంటి ఎంపికలు ఉంటాయి.

ప్రశ్నలకు.. డిజి బ్యాంకు

దేశంలో 1.5 లక్షల ప్రాంతాల్లో సీబీటీకి అవకాశం



భారీ డిజిటల్ ప్రశ్నల నిధిని ఏర్పాటు చేయాలి

పరీక్ష పేపర్లు వద్దు.. పరీక్ష రోజే ప్రశ్నపత్రం తయారీ.. కంప్యూటర్ ఆధారిత పరీక్షలను విస్తరించాలి

ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నిలేకని ప్రతిపాదనలు.. మోదీ సానుకూలంగా ఉన్నారని వెల్లడి

ప్రశ్నపత్రం తయారుచేయడం నుంచి ముద్రించడం, రవాణా చేయడం, పరీక్షా కేంద్రాలకు చేర్చడం వరకు ప్రతి దశలోనూ లీకేజీలకు అవకాశం ఉంటే.. ఆ ప్రశ్నపత్రమే లేకుండా పరీక్ష నిర్వహించలేమా? సమాచార సాంకేతిక రంగంలో విశేష అనుభవమున్న ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నిలేకని ప్రతిపాదన ఇదే. ముందుగానే ఒక ప్రశ్నపత్రాన్ని రూపొందించి భద్రపరిచే సంప్రదాయానికి స్వస్తి పలికి, భారీ డిజిటల్ ప్రశ్నల నిధి నుంచి పరీక్ష జరిగే రోజునే చివరి నిమిషంలో ప్రశ్నపత్రాన్ని రూపొందించాలని ఆయన సూచించారు. ఢిల్లీలో మంగళవారం జరిగిన బ్లూమ్‌బెర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్‌లో మాట్లాడిన నిలేకని.. పరీక్షలకు ఒకే ప్రశ్నపత్రాన్ని ముందుగా రూపొందించి ఉంచాల్సిన

తరువాయి 2 వ పేజీలో...



జగిత్యాల మహిళా రైతుకు జాతీయ అవార్డు

ఎకరం భూమిలో 14 రకాల కూరగాయల సాగు.. వైవిధ్య పంటలతో అదనపు ఆదాయం

పెంబట్లకు చెందిన బండారి విజయకు 'మహిళా కిసాన్ దివస్' అవార్డు

పరిమిత భూమి.. విభిన్న పంటల సాగు.. వ్యవసాయంలో కొత్త ఆలోచనలు.. వీటినే పెట్టుబడిగా మలుచుకుని సాగును లాభసాటిగా మార్చుకుంటున్న జగిత్యాల జిల్లా మహిళా రైతు బండారి విజయకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. సారంగాపూర్ మండలం పెంబట్ల గ్రామానికి చెందిన ఆమె 'మహిళా కిసాన్ దివస్' అవార్డుకు ఎంపిక య్యారు. తనకున్న ఎకరం భూమిలో ఏకంగా 14 రకాల కూరగాయలను సాగు చేస్తూ, ఒకే పంటపై ఆధారపడకుండా వివిధ రకాల పంటల ద్వారా ఆదాయం పొందుతున్నందుకు ఆమెను ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ఆమె సాగు విధానాలను గుర్తించి జాతీయ స్థాయి అవార్డుకు పేరును ప్రతిపాదించగా, కేంద్ర ప్రభుత్వం ఆ ప్రతిపాదనను పరిశీలించి ఎంపిక చేసినట్లు సమాచారం.


సారంగాపూర్, అక్టోబర్ 13 (ఈవార్తలు): సాధారణంగా రైతులు ఒకటి లేదా రెండు ప్రధాన పంటలపై ఆధారపడుతుంటారు. అయితే, బండారి విజయ అందుకు భిన్నంగా ఆలోచించారు. తనకున్న పరిమిత భూమిలోనే పలు రకాల కూరగాయలను సాగు చేస్తూ పంటల వైవిధ్యానికి ప్రాధాన్యమిస్తున్నారు. ఒకే పంట సాగుతో వచ్చే ఆదాయానికే పరిమితం కాకుండా, వివిధ పంటల ద్వారా ఆదాయ మార్గాలను విస్తరించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఎకరం భూమిలో 14 రకాల కూరగాయలను సాగు చేయడం ఆమె వ్యవసాయంలో అనుసరిస్తున్న వైవిధ్యానికి నిదర్శనం. పంటల ఎంపికలో వైవిధ్యాన్ని పాటించడంతోపాటు అంతర పంటల సాగు పైనా ఆమె దృష్టి సారిస్తున్నారు. ప్రధాన పంటతోపాటు అనుకూలమైన ఇతర పంటలను సాగు చేయడం ద్వారా భూమిని సమర్థంగా వినియోగించుకోవచ్చు. -2 వ పేజీలో...



15 మంది పిల్లలు జలసమాధి

గంగానదిలో పడవ బోల్తా.. ఏడుగురు ఒకే కుటుంబం.. బీహార్‌లోని హాజీపూర్‌లో ఘటన

వైశాలి: బీహార్‌లోని వైశాలి జిల్లాలో ఘోర పడవ ప్రమాదం చోటుచేసుకుంది. రఘోపూర్ ప్రాంతంలో గంగానదిలో పడవ బోల్తా పడటంతో 15 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఆరు నుంచి 15 ఏళ్ల వయసున్న చిన్నారులు ఉన్నట్లు సమాచారం. వీరిలో ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు చిన్నారులు ఉండటం విషాదాన్ని మరింత పెంచింది. మంగళవారం రాత్రి సుమారు 8.30 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. 25 మందికి పైగా ప్రయాణికులు ఒక చిన్న పడవలో ఆలయంలో ఏర్పాటు చేసిన అన్నదానానికి వెళ్తుండగా పడవ అదుపుతప్పి నదిలో బోల్తా పడింది. ప్రమాదంలో గాయపడిన ఏడుగురిని చికిత్స కోసం పాట్నాలోని వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించినట్లు వైశాలి జిల్లా కలెక్టర్ వర్షా సింగ్ తరువాయి 2 వ పేజీలో...



మీ ఓటమికి 'సర్'పై నిందా?

రాహుల్ గాంధీపై అమిత్ షా ఫైర్

న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గుజరాత్‌లోని గాంధీనగర్ సహా ఇతర ప్రాంతాల్లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమికి ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కారణమా? అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఎస్ఐఆర్ ఇటీవల వచ్చిందేనని, కానీ రాహుల్ గాంధీ రాజకీయాల్లోకి ప్రవేశించినప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీ తరువాయి 2 వ పేజీలో...



మీసేవ సర్టిఫికెట్లు చినిగిపోవు!

ఎక్కువ కాలం మన్నికతో సెక్యూరిటీ పేపర్

ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు

ప్రభుత్వ ధ్రువపత్రాల భద్రత, మన్నిక పెంచే దిశగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. చినిగిపోకుండా, నీళ్లు పడినా దెబ్బతినకుండా ప్రత్యేకంగా రూపొందించిన కొత్త మీ సేవా సర్టిఫికెట్ పేపర్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంగళవారం ప్రారంభించారు.

హైదరాబాద్, అక్టోబర్ 13 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. జనన, మరణ ధ్రువపత్రాలతోపాటు విద్య, ఉద్యోగ, ఇతర అధికారిక అవసరాలకు ఉపయోగించే సర్టిఫికెట్లు ప్రజల జీవితంలో ఎంతో ముఖ్యమైనవని పేర్కొన్నారు. కొన్ని పత్రాలను జీవితాంతం భద్రంగా ఉంచుకోవాల్సి ఉంటుందన్నారు. అలాంటి ధ్రువపత్రాలు త్వరగా పాడవకుండా చూడటంతో పాటు వాటి విశ్వసనీయతను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రజలకు అందించే ప్రభుత్వ సేవల్లో నాణ్యత, భద్రత, సౌలభ్యాన్ని మరింత పెంచే దిశగా ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నామని మంత్రి వివరించారు. కొత్త సెక్యూరిటీ పేపర్‌తో సర్టిఫికెట్ల మన్నిక పెరగడంతో తరువాయి 2 వ పేజీలో...



స్టార్‌లింక్‌కు అనుమతులు వద్దు

కేంద్రానికి ఆరెస్సెస్ అనుబంధ సంస్థ విజ్ఞప్తి

న్యూఢిల్లీ: ప్రముఖ పారిశ్రామికవేత్త ఎలాన్ మస్క్‌కు చెందిన 'స్టార్‌లింక్' శాటిలైట్ బ్రాడ్‌బ్యాండ్ సేవలకు భారత్‌లో అనుమతులు మంజూరు చేయవద్దని, ఇందుకు సంబంధించిన ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని ఆరెస్సెస్ అనుబంధ సంస్థ స్వదేశీ జాగరణ్ మంచ్ (ఎస్‌జేఎం) కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. అనుమతుల జాప్యంపై ఎలాన్ మస్క్ భారత ప్రభుత్వం, వ్యాపార వర్గాలను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన ఎస్‌జేఎం, ఇవి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలని ఆరోపించింది. ఈ -2 వ పేజీలో.

ఎల్బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ కారిడార్



కేంద్రం గ్రీన్ సిగ్నల్.. గడ్కరీతో మంత్రి కోమటిరెడ్డి భేటీ

హైదరాబాద్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవేపై సానుకూల స్పందన

న్యూఢిల్లీ: తెలంగాణలోని పలు కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంగళవారం ఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సవావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులపై చర్చించగా, కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. హైదరాబాద్‌లోని అత్యంత రద్దీ మార్గాల్లో ఒకటైన ఎల్బీ నగర్ నుంచి హయత్‌నగర్ వరకు డబుల్ డెక్కర్ తరువాయి 2 వ పేజీలో.



ఆర్మీ అమ్ములపొదిలో నాగాస్త్ర-1ఆర్

450 డ్రోన్లను అందించిన ఎస్‌డీఏఎల్

న్యూఢిల్లీ: భారత ఆర్మీకి మరింత బలం చేకూరనుంది. సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్ (ఎస్‌డీఏఎల్) అనే సంస్థ 450 డ్రోన్లను తయారు చేసి, ఇండియన్ ఆర్మీకి అందించింది. ఇవి నాగాస్త్ర-1ఆర్ పేరుగల కమికాజి డ్రోన్లు. అంటే, ఇవి సూసైడ్ డ్రోన్లు. ఇవి దగ్గర్లోని లక్ష్యాలపై దాడి చేసేందుకు తరువాయి 2 వ పేజీలో...

రాశి ఫలాలు

14.10.2026

మేషం: దూరప్రయాణాల వలన శ్రమ అధికమౌతుంది. రావలసిన సొమ్ము సకాలంలో చేతికి అందదు. వృథా ఖర్చులు పెరుగుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో ఆటుపోట్లు తప్పవు. బంధువులతో అకారణంగా మాట పట్టింపులుంటాయి. కుటుంబ వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు.

వృషభం: గృహమున శుభకార్యములు నిర్వహిస్తారు. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. వ్యాపార, ఉద్యోగాలలో ఒడిదుడుకులు తొలగుతాయి. సన్నిహితులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. వృత్తి వ్యాపారాలలో కీలక నిర్ణయాలు అమలు పరుస్తారు.

మిథునం: ఆరోగ్యపరంగా చికాకులు తప్పవు. వ్యాపారాలలో జాగ్రత్త అవసరం. చేపట్టిన వ్యవహారాలలో ఆటంకాలు ఉంటాయి. ఇంటా బయట బాధ్యతలు పెరుగుతాయి. దూర ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. ఇతరులకు ధనపరంగా మాట ఇవ్వడం మంచిది కాదు. ఉద్యోగమున మీ కష్టం ఫలించదు.

కర్కాటకం: ఆకస్మిక ధనలాభ సూచనలున్నవి. వ్యాపార, ఉద్యోగాలు ఉత్సాహంగా సాగుతాయి. గృహ నిర్మాణ ప్రయత్నాలలో ముందడుగు వేస్తారు. నూతన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. దూరపు బంధువుల నుండి అందిన సమాచారం ఊరట కలిగిస్తుంది. స్నేహితులతో వివాదాలు సర్దుబాటు కాగలవు.

సింహం: ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వ్యాపారాలు లాభాల బాటలో సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో నూతనోత్సాహంతో ముందుకు సాగుతారు. బంధుమిత్రుల సహాయ సహకారాలతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. ఆదాయం సంతృప్తినిస్తుంది. సోదరులతో శుభకార్య విషయాలపై చర్చలు చేస్తారు.

కన్య: దూరప్రయాణాలలో వాహన ఇబ్బందులుంటాయి. నూతన ఋణాలు చేస్తారు. ఇంటా బయట బాధ్యతలు ఉక్కిరి బిక్కిరి చేస్తాయి. కుటుంబ సభ్యుల ప్రవర్తన వలన మానసిక ప్రశాంతత లోపిస్తుంది. చేపట్టిన పనుల్లో అవాంతరాలు కలుగుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో సమస్యలు అధికమౌతాయి.

తుల: చిన్నపాటి అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. బందు మిత్రులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. వ్యాపార, ఉద్యోగాలలో ఊహించని మార్పులుంటాయి. కొన్ని కార్యక్రమాలు ముందుకు సాగక నిరాశ పెరుగుతుంది. రెండు రకములైన ఆలోచన వలన ధన నష్టాలు తప్పవు.

వృశ్చికం: ఉద్యోగ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. నిరుద్యోగులు నూతన ఉద్యోగ అవకాశములు పొందుతారు. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. నూతన కార్యక్రమాలు చేపడతారు. వృత్తి వ్యాపారాలలో మీ అంచనాలు నిజమవుతాయి.

ధనస్సు: వ్యాపారాలు గతం కంటే మెరుగవుతాయి. ఉద్యోగమున అధికారుల అనుగ్రహం కలుగుతుంది. సంతాన విద్యా ఉద్యోగ ప్రయత్నాలు సానుకూలమౌతాయి. గృహ నిర్మాణ పనులు ప్రారంభిస్తారు. చిన్ననాటి స్నేహితుల నుంచి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. ఆకస్మిక ధన లాభ సూచనలున్నవి.

మకరం: దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు. రాబడికి మించి ఖర్చులు పెరుగుతాయి. సోదరులతో అస్తి వివాదాలు ఉంటాయి. వ్యాపార, ఉద్యోగాలలో ఊహించని ఇబ్బందులుంటాయి. నూతన ఋణ ప్రయత్నాలు ఫలించవు. కుటుంబ వాతావరణం గందరగోళంగా ఉంటుంది.

కుంభం: వృత్తి వ్యాపారాలలో అంచనాలు అందుకోవడంలో విఫలమౌతారు. సన్నిహితుల నుండి ఊహించని విమర్శలు ఎదురవుతాయి. ఉద్యోగ ప్రయత్నాలు మందకోడిగా సాగుతాయి. ఆర్థిక సమస్యలు తప్పవు. చేపట్టిన పనులలో కష్టానికి తగ్గ ఫలితం దక్కదు. ముఖ్యమైన పనులు వాయిదా వేస్తారు.

మీనం: వ్యాపార విస్తరణకు మిత్రుల సహాయం అందుతుంది. ఆదాయం గతం కంటే మెరుగ్గా ఉంటుంది. సన్నిహితులతో గృహమున ఆనందంగా గడుపుతారు. ఉద్యోగాలు ఆశాజనకంగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో మీ సేవలకు తగిన గుర్తింపు పొందుతారు. సోదరులతో అస్తి వివాదాలు పరిష్కారమౌతాయి.

ప్రశ్నలకు..డిజి బ్యాంకు

మొదటి పేజీ తరువాయి

న్యూఢిల్లీ: అవసరం ఏమిటని ప్రశ్నించారు. ప్రశ్నపత్రం సిద్ధంగా ఉన్న క్షణం నుంచే దాన్ని అక్రమంగా సంపాదించి విక్రయించేందుకు ఆర్థిక ప్రేరణ ఏర్పడుతుందని అభిప్రాయప డ్డారు. దీనికి ప్రత్యామ్నాయంగా ప్రతి సబ్జెక్టుకు సంబం ధించిన ప్రశ్నలతో భారీ నిధిని నిర్మించి, నిర్ణీత ప్రమాణాల ప్రకారం పరీక్షకు కొద్దిసేపటి ముందే ప్రశ్నపత్రాన్ని రూపొందించాల ని సూచించారు. 'ఈ విధానంలో ప్రశ్నలు ఒకేచోట ముందుగా సమీక రించి ఉంచినా, ఏ ప్రశ్నలు ఏ పరీక్షలో వస్తాయనే విషయం ముందే బయటపడకుండా సాంకేతిక రక్షణ కల్పించవచ్చు. ప్రతి అభ్యర్థికి ఒకే ప్రమాణాలతో రూపొందించిన ప్రశ్నల సముదాయం అందేలా కంప్యూటర్ వ్యవస్థను తీర్చిదిద్దవచ్చు. ఫలితంగా ఒక నిర్దిష్ట ప్రశ్నపత్రాన్ని సంపాదించి విక్రయించడం ద్వారా అక్రమంగా లాభపడే అవకాశాన్ని తగ్గించవచ్చు' అని వివరించారు. వైద్య విద్యలో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్-యూజీ పరీక్ష చుట్టూ తలెత్తిన ప్రశ్నపత్రాల లీకేజీ వివాదాలు, విద్యార్థుల ఆందోళనలు పరీక్షల నిర్వహణలో భద్రతపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తాయి. లక్షల మంది అభ్యర్థులు నెలల తరబడి శ్రమించి పరీక్షలకు సిద్ధమవుతున్నప్పుడు, కొందరి అక్రమ చర్యల కారణంగా పరీక్ష రద్దయినా, ఫలితాలపై అనుమానాలు తలెత్తినా నష్టపోయేది నిజాయితీగా కష్టపడిన విద్యార్థులే. వారి సమయం, డబ్బు, మానసిక ప్రశాంతత దెబ్బతింటాయి. కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడుతుంది. ఈ నేపథ్యంలో పరీక్షల నిర్వహణలో సమగ్ర సంస్కరణలను సూచించేందుకు కేంద్ర ప్రభుత్వం నందన్ నిలేకని నేతృత్వంలో ఉన్నతస్థాయి కార్యదళాన్ని ఏర్పాటు చేసింది. పరీక్షల రూపకల్పన, భద్రత, నిర్వహణ, పాలనా వ్యవస్థలో మార్పులపై ఈ బృందం పరిశీలన జరుపుతోంది. ఈ సూచనలను అమలు చేయడంపై ప్రధాని నరేంద్ర మోదీ ఆసక్తిగా ఉన్నారని నిలేకని తెలిపారు. ప్రశ్నల నిధి ఏర్పాటు చేయడంతోపాటు దేశవ్యాప్తంగా కంప్యూటర్ ఆధారిత పరీక్షల నిర్వహణను విస్తరించాల్సిన అవసరాన్ని నిలేకని ప్రస్తావించారు.

ఇతర దేశాల్లో అమలు ఇలా..

ప్రశ్నల నిధి నుంచి ప్రశ్నలను ఎంపిక చేయడం, కంప్యూటర్ ద్వారా పరీక్షలు నిర్వహించడం వంటి పద్ధతులు ప్రపంచవ్యాప్తంగా వివిధ రూపాల్లో అమలవుతున్నాయి. అయితే నిలేకని సూచించినట్లుగా దేశవ్యాప్తంగా అన్ని ప్రధాన పరీక్షలకు పరీక్ష జరిగే రోజే చివరి నిమిషంలో ప్రశ్నపత్రాలను రూపొందించే పూర్తి విధానం పలు దేశాల్లో అమలు అవుతోంది.

అమెరికా: గ్రాడ్యుయేట్ రికార్డ్ ఎగ్జామినేషన్ (జీఆర్ఈ) వంటి పరీక్షలను నిర్వహించే ఈటీఎస్ సంస్థ పెద్ద సంఖ్యలో కొత్త ప్రశ్నలను రూపొందిస్తూ, ప్రశ్నల వినియోగాన్ని నియంత్రించే పద్ధతులను అనుసరిస్తోంది. పరీక్షల భద్రతకు సాంకేతిక రక్షణలు, గుర్తింపు ధ్రువీకరణ, పర్యవేక్షణ, అనుమానాస్పద ఫలితాల విశ్లేషణ వంటి చర్యలను ఉపయోగిస్తోంది. ప్రశ్నల మార్పిడి, పునరావృతం ద్వారా అక్రమాలకు అవకాశం తగ్గించేందుకు ప్రయత్నిస్తోంది.


సింగపూర్: జాతీయ పరీక్షల నిర్వహణలో డిజిటల్ విధానాలను క్రమంగా విస్తరిస్తోంది. సింగపూర్ పరీక్షలు, మూల్యాంకన మండలి వివిధ స్థాయిల్లో మౌఖిక, ప్రాయోగిక, లిఖిత పరీక్షలకు సంబంధించిన డిజిటల్ వనరులు, మార్గదర్శకాలను అందిస్తోంది. 2026లోనూ కొన్ని ఉన్నత పాఠశాల స్థాయి పరీక్షలకు కంప్యూటర్ ఆధారిత విధానాలను విస్తరించింది.

చైనా: విశ్వవిద్యాలయ ప్రవేశాలకు నిర్వహించే గావ్‌కావో పరీక్షలో భద్రత, పర్యవేక్షణ, మోసాల నిరోధానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. పరీక్షల నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడంతోపాటు ప్రశ్నపత్రాల భద్రత, సమాచార మార్పిడి, అత్యవసర పరిస్థితుల నిర్వహణను బలోపేతం చేస్తోంది.

మీ ఓటమికి 'సర్'పై నింద?

మొదటి పేజీ తరువాయి

వరుస పరాజయాలను చవిచూస్తోందని, తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ఇటువంటి నిరాధార ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. మంగళవారం 'ఇండియా' కూటమి నేతలు, విద్యార్థి సంఘాలతో సమావేశమైన అనంతరం రాహుల్ గాంధీ మీడియా సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలు జరుగుతున్నాయని, సీఈసీ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. దేశంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసమే తమ పోరాటమని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. రాహుల్ మీడియా సమావేశం ముగిసిన వెంటనే స్పందించిన అమిత్ షా, గుజరాత్ ఎన్నికల ఫలితాలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు. "గుజరాత్ ప్రజల మనోగతాన్ని ఈ ఫలితాలు ప్రతిబింబిస్తున్నాయి. యావత్ దేశం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెనుక కొండలా నిలబడి ఉందన్న విషయాన్ని ఈ



విజయం చాటిచెప్పింది. గాంధీనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 44 స్థానాలకు గాను బీజేపీ 38 చోట్ల ఘన విజయం సాధించింది. గత ఎన్నికలతో పోలిస్తే బీజేపీ ఓటు బ్యాంకు 10 శాతం పెరిగింది. రాహుల్ గాంధీకి నేను ఒక విషయం స్పష్టం చేయాలనుకుంటున్నాను. గాంధీనగర్‌లో గత 41 ఏళ్లుగా కాంగ్రెస్ ఒక్క ఎన్నికలోనూ విజయం సాధించలేదు" అని ఆయన గుర్తుచేశారు. "రాహుల్ జీ, ఈ ఫలితాలకు కూడా ఓటర్ల జాబితా సవరణే కారణమని అంటారా? ప్రధాని మోదీకి, బీజేపీకి ఉన్న ప్రజాదరణను మీరు తోసిపుచ్చుతారా? మీరు తీవ్రంగా ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఒకప్పుడు అధికారంలో ఉన్న కీలక ప్రాంతంలో 41 ఏళ్లుగా గెలవలేకపోవడంపై ఆలోచించాల్సిన అవసరం ఉంది. ఇటీవల పశ్చిమ బెంగాల్, తమిళనాడు, పుదుచ్చేరిల్లో జరిగిన ఉప ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది" అని అమిత్ షా ఎత్తి చూపారు. ఢిల్లీలో వివిధ పార్టీల కార్యకర్తలను, జనాలను పోగేసినంత మాత్రాన దేశ ప్రజల నమ్మకాన్ని గెలుచుకోలేరని ఆయన హితవు పలికారు. "దేశ ప్రజల వాస్తవ గొంతుక పొలాల్లో, గ్రామాల్లో, మారుమూల కొండలు, అడవులు, నదీ తీరాల్లో ఉంది. మీకు అక్కడి ప్రజలతో సంబంధాలు తెగిపోయాయి. బీహార్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు వంటి అనేక రాష్ట్రాల్లో ప్రజలు దశాబ్దాలుగా కాంగ్రెస్‌ను తిరస్కరిస్తూనే ఉన్నారు. ఇప్పటికైనా ప్రతికూల రాజకీయాలు మానుకుని ప్రజలతో మమేకం కావాలి" అని ఆయన సూచించారు.



ఆర్మీ అమ్ములపొదిలో నాగాస్త్ర-1ఆర్

మొదటి పేజీ తరువాయి

ఉపయోగపడతాయి. వీటిని తయారు చేసిన ఎస్‌డీఏఎల్.. సోలార్ ఇండస్ట్రీస్ ఇండియా సబ్సిడరీ సంస్థ. ఇలా ఒక సంస్థ ఒకేసారి, ఇంత పెద్ద మొత్తంలో ఇండియన్ ఆర్మీకి డ్రోన్లు అందించడం ఇదే మొదటిసారి. అత్యవసర కొనుగోలులో భాగంగా ఇండియన్ ఆర్మీ వీటిని తయారు చేయించుకుంది. గత ఏడాది మార్చిలో ఇండియన్ ఆర్మీ వివిధ సంస్థల్ని ఈ డ్రోన్ల తయారీకి ఆహ్వానించింది. కానీ, ఎస్‌డీఏఎల్ సంస్థ మాత్రమే నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా ఉండటంతో టెండర్ దక్కించుకుంది. నాగాస్త్ర-1ఆర్ డ్రోన్లు సూసైడ్ డ్రోన్లుగా పిలుస్తారు. ఇవి తక్కువ దూరంలోని లక్ష్యాలపై దాడి చేయగలవు. అంతేకాదు.. మధ్యలోనే అవసరమైతే తిరిగి వెనక్కి రాగలవు. అందులోనూ డ్రోన్లను సురక్షితంగా ల్యాండ్ చేయగలవు. సాధారణంగా ఒకసారి డ్రోన్లు ప్రయోగించిన తర్వాత వాటిని మధ్యలో నిలువరించడం కష్టం. వాటిని ఆపాలంటే పేల్చేయాల్సిందే. కానీ, ఇవి తమ ప్రయాణం మధ్యలో వెనక్కుతిరిగి రాగలవు. ప్రస్తుతం అనేక దేశాలు నిరంతరం యుద్ధం చేసుకుంటున్నాయి. ఇలాంటి సమయంలో ఆయుధాల కొనుగోలు ఆర్థిక భారంగా మారింది. అందుకే, దేశీయంగా ఇలాంటివి తయారు చేయడం వల్ల తక్కువ ఖర్చుతోనే ఆయుధాల్ని తయారు చేసుకోగలుగుతున్నాం. ఇక, ఎస్‌డీఏఎల్ సంస్థ మరిన్ని ఆధునిక ఆయుధాలు తయారు చేసేందుకు సిద్ధమవుతోంది.

ఎల్బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ కారిడార్

మొదటి పేజీ తరువాయి

ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి గడ్కరీ ఆమోదం తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే విజయవాడ జాతీయ రహదారిపై ట్రాఫిక్ కష్టాలు గణనీయంగా తీరనున్నాయి. వీటితో పాటు, కృష్ణా నదిపై నిర్మించతలపెట్టిన ఐకానిక్ కేబుల్ బ్రిడ్జ్‌ల శంకుస్థాపన ప్రతిపాదనకు కూడా ఆయన సానుకూలత వ్యక్తం చేశారు. తెలుగు రాష్ట్రాలను కలిపే హైదరాబాద్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంపైనా ఈ సమావేశంలో చర్చ జరిగింది. ఈ ప్రతిపాదనపై కూడా గడ్కరీ సానుకూలంగా స్పందించినట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. ఇదే క్రమంలో, నవంబర్ 19 నుంచి 22 వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'ఇండియన్ రోడ్' కాంగ్రెస్ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని గడ్కరీని ఆయన ఆహ్వానించారు.

దీపావళి తర్వాతే ఎండీఆర్ చార్జీల వడ్డన

మొదటి పేజీ తరువాయి

అక్టోబర్ 15 అమలు తేదీని మారుస్తూ, నవంబర్ రెండవ వారం నుంచి ఈ చార్జీలను అమల్లోకి తెస్తున్నట్లు యూపీఐ స్టీరింగ్ కమిటీ మంగళవారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. పండుగ రోజుల్లో కస్టమర్ల ఖర్చులు విపరీతంగా పెరిగే తరుణంలో, వ్యాపారులు, పేమెంట్ కంపెనీలు తమ ఐటీ సిస్టమ్‌లను అప్‌డేట్ చేసుకోవడానికి, మార్పులను సులభంగా స్వీకరించడానికి ఈ అదనపు సమయం ఉపకరిస్తుందని నిపుణులు భావిస్తున్నారు. యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ విధించడాన్ని హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దేశవ్యాప్తంగా పండుగ సీజన్ సమయంలో ఇలాంటి నిర్ణయం వల్ల ఖర్చుల భారం పడుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే వ్యాపారుల విజ్ఞప్తులను పరిశీలించిన ఎన్‌పీసీఐ ఎండీఆర్ చార్జీల అమలును తాత్కాలికంగా వాయిదా వేసింది. కొత్త నిబంధన ప్రకారం.. రూ. 2,000 దాటిన పర్సన్-టు-మర్చంట్ (పీ2ఎం) యూపీఐ చెల్లింపులపై వ్యాపారుల నుండి 0.4 శాతం (లేదా గరిష్టంగా రూ. 300) ఎమ్‌డీఆర్ రుసుమును వసూలు చేస్తారు.

ఒక్కొక్కరికి రూ.1.53 లక్షలు

మొదటి పేజీ తరువాయి

వారికీ బోనస్ ప్రకటించారు. కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5,500 చొప్పున చెల్లించనున్నారు. మరోవైపు సంస్థ నికర లాభాల్లో 34 శాతం వాటాను పర్మినెంట్ కార్మికులకు పంపిణీ చేయనున్నారు. దీంతో సింగరేణి కార్మికుల ఇళ్లలో పండుగ సందడి నెలకొంది. సింగరేణి సాధించిన నికర లాభాల్లో 34 శాతాన్ని పర్మినెంట్ కార్మికులకు బోనస్‌గా అందించాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈ మేరకు అర్హులైన ప్రతి కార్మికుడికి గరిష్ఠంగా రూ.1,53,913 వరకు అందనుంది. పండుగకు ముందే ఈ మొత్తాన్ని కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు యాజమాన్యం వెల్లడించింది. గతేడాది తరహాలోనే ఈసారి కూడా కాంట్రాక్టు కార్మికులకు బోనస్ అందించనున్నారు. ఒక్కొక్కరికి రూ.5,500 చొప్పున చెల్లించనున్నారు. దీంతో సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల కుటుంబాల్లోనూ దసరా ఆనందం నిండనుంది. బొగ్గు గనుల్లో రేయింబవళ్లు శ్రమిస్తూ సంస్థ అభివృద్ధికి తోడ్పడుతున్న కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నామని యాజమాన్యం పేర్కొంది. పండుగ వేళ బోనస్ ప్రకటనతో కార్మికుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

జగిత్యాల మహిళా రైతుకు జాతీయ అవార్డు

మొదటి పేజీ తరువాయి

పంటల కాలవ్యవధి, సాగు అవసరాలు, అందుబాటులో ఉన్న విస్తీర్ణాన్ని బట్టి సాగు విధానాలను ఎంచుకోవడం రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది. విజయ అనుసరిస్తున్న విభిన్న సాగు విధానాలు కూడా ఈ దిశగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

ఒకే పంటపై ఆధారపడకుండా..

వ్యవసాయంలో పంటల వైవిధ్యం రైతులకు పలు విధాలుగా ఉపయోగపడుతుంది. ఒక పంటకు గిట్టుబాటు ధర లభించకపోయినా, ఇతర పంటల ద్వారా కొంత ఆదాయం పొందే అవకాశం ఉంటుంది. వివిధ కూరగాయలను సాగు చేయడం వల్ల కోతలు వేర్వేరు సమయాల్లో వచ్చే అవకాశం ఉండటంతో ఆదాయం కూడా దశలవారీగా సమకూరవచ్చు. అయితే, ఈ ప్రయోజనాలు పంటల ఎంపిక, దిగుబడి, మార్కెట్ ధరలు, సాగు ఖర్చులు, నీటి లభ్యత వంటి అంశాలపై ఆధారపడి ఉంటాయి. అంతర పంటల సాగు ద్వారా భూమిని మరింత సమర్థంగా వినియోగించుకునే అవకాశం ఉన్నప్పటికీ, పంటల మధ్య పోషకాలు, నీరు, వెలుతురు కోసం పోటీ ఏర్పడకుండా తగిన ప్రణాళిక అవసరం. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంచుకోవడం చిన్న, సన్నకారు రైతులకు కీలకం. బండారి విజయ సాగు విధానాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం, పరిమిత భూమిలో విభిన్న పంటల సాగుకు ఉన్న ప్రాధాన్యాన్ని మరోసారి చాటిచెప్పింది.

పెంబట్ల నుంచి జాతీయ స్థాయికి..

సారంగాపూర్ మండలం పెంబట్ల గ్రామానికి చెందిన బండారి విజయ సాధించిన ఈ గుర్తింపు గ్రామానికే కాకుండా జగిత్యాల జిల్లాకు గర్వకారణంగా నిలిచింది. ఒక ఎకరం భూమిలో 14 రకాల కూరగాయలను సాగు చేస్తూ విభిన్న పంటల విధానాన్ని అనుసరిస్తున్న ఆమె కృషిని వ్యవసాయ శాఖ అధికారులు గుర్తించి అవార్డుకు ప్రతిపాదించడం, ఆ ప్రతిపాదనకు కేంద్ర స్థాయిలో ఆమోదం లభించడం విశేషం. వ్యవసాయంలో విజయానికి భూమి విస్తీర్ణం ఒక్కటే కొలమానం కాదని, అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకోవడం, పంటల ఎంపికలో వైవిధ్యాన్ని పాటించడం కూడా ముఖ్యమని బండారి విజయ సాగు విధానం తెలియజేస్తోంది. జాతీయ స్థాయి అవార్డుకు ఆమె ఎంపిక కావడం మహిళా రైతుల కృషికి లభించిన గౌరవంగా, చిన్న రైతులకు స్ఫూర్తినిచ్చే పరిణామంగా నిలుస్తోంది.

మహిళా రైతు కృషికి గౌరవం

వ్యవసాయ రంగంలో మహిళలు విత్తనాల ఎంపిక నుంచి పంటల సాగు, కలుపు తీయడం, కోతలు, పంటల అనంతర పనుల వరకు కీలక పాత్ర పోషిస్తున్నారు. అయినప్పటికీ, వారి కృషికి తగిన గుర్తింపు లభించాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో బండారి విజయ జాతీయ స్థాయి అవార్డుకు ఎంపిక కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. వ్యవసాయంలో వైవిధ్యమైన పద్ధతులను అవలంబిస్తూ తనకున్న భూమిని సద్వినియోగం చేసుకుంటున్న ఆమెకు లభించిన గుర్తింపు, గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం చేస్తున్న మహిళలకు ప్రోత్సాహాన్నిచ్చే అంశం. మహిళా రైతుల అనుభవాలను ఇతర రైతులకు పరిచయం చేయడం, విజయవంతమైన సాగు పద్ధతులపై అవగాహన కల్పించడం, వ్యవసాయ శాఖ ద్వారా సాంకేతిక మార్గదర్శకత్వం అందించడం వంటి చర్యలు మరింత మంది రైతులకు ప్రయోజనం చేకూర్చుతాయి.

మీసేవ సర్టిఫికెట్లు చినిగిపోవు!

మొదటి పేజీ తరువాయి

పాటు నకిలీలను అరికట్టేందుకు వీలవుతుందన్నారు. ప్రభుత్వ ధ్రువపత్రాలపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యేలు రాజ్‌ఠాకూర్, విజయరమణారావు, ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ కమిషనర్ టి.రవికిరణ్, అధికారులు, ప్రింటింగ్ ఏజెన్సీలు, సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. కొత్త మీ సేవా సర్టిఫికెట్ పేపర్‌లో 15 అత్యాధునిక భద్రతా ఫీచర్లను పొందుపరిచారు. నకిలీ సర్టిఫికెట్ల తయారీ, అనధికార నకళ్లను అరికట్టేలా వీటిని రూపొందించారు. భద్రతా కారణాలతో ఈ ఫీచర్ల పూర్తి వివరాలను వెల్లడించడం లేదని మీసేవా నిర్వాహకులు తెలిపారు. ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన ఈ పేపర్ సులభంగా చినిగిపోదు. నీళ్ల పడినా త్వరగా దెబ్బతినదు. సాధారణ వినియోగం, మడతపెట్టడం, ఎక్కువ కాలం భద్రపరచడం వల్ల కలిగే నష్టాన్ని తగ్గిస్తుంది. దీంతో సర్టిఫికెట్లను ఏళ్ల తరబడి మంచి స్థితిలో దాచుకునే అవకాశం ఉంటుంది. సాధారణ పరిస్థితుల్లో వాటికి లామినేషన్ చేయించాల్సిన అవసరం కూడా తగ్గుతుందని వెల్లడించారు. తెలంగాణలో మీ సేవ కేంద్రాల ద్వారా ప్రజలకు అనేక రకాల ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. 2011 నుంచి మీ సేవా సర్టిఫికెట్ల ముద్రణకు ప్రత్యేక సెక్యూరిటీ పేపర్‌ను వినియోగిస్తున్నారు. ఇప్పటివరకు ఉన్న పేపర్ స్థానంలో మరింత నాణ్యత, భద్రత, మన్నిక కలిగిన కొత్త పేపర్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ముఖ్యంగా జనన, మరణ ధ్రువపత్రాలతో పాటు దీర్ఘకాలం భద్రపరచాల్సిన ఇతర ప్రభుత్వ పత్రాలకు ఇది ఎంతో ఉపయోగపడనుంది

పిల్లలు జలసమాధి

మొదటి పేజీ తరువాయి

తెలిపారు. ఇంకా ఎంతమంది గల్లంతయ్యారనే దానిపై స్పష్టత లేదని, గల్లంతైన వారి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు వెల్లడించారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున, గాయపడ్డవారికి రూ.50 వేల చొప్పున పరిహారం అందించనున్నట్లు బీహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌధరి ప్రకటించినట్లు సమాచారం. ప్రధానమంత్రి కార్యాలయం నుంచి రూ.2 లక్షల పరిహారం ప్రకటించినట్లు తెలిసింది.

శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో 7.750 కిలోల గంజాయి సీజ్

హైదరాబాద్, అక్టోబర్ 13 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు భారీ మొత్తంలో గంజాయిని పట్టుకున్నారు. ఎలక్ట్రిక్ గీజర్‌లో దాచి అక్రమంగా తరలిస్తున్న 7.750 కిలోల హైడ్రోపోనిక్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో సుమారు రూ. 2.71 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. పక్కా సమాచారం అందుకున్న డీఆర్ఐ హైదరాబాద్ జోనల్ యూనిట్ అధికారులు, అక్టోబర్ 12న బ్యాంకాక్ నుంచి వచ్చిన విమానంలో ప్రయాణించిన ఓ భారతీయుడిని అడ్డగించారు. అతని చెక్-ఇన్ బ్యాగేజీని తనిఖీ చేయగా, అందులో ఒక ఎలక్ట్రిక్ గీజర్ కనిపించింది. అనుమానంతో దాన్ని తెరిచి చూడగా, లోపల 73 ప్యాకెట్లలో పచ్చని పదార్థం బయటపడింది. నార్కోటిక్ డ్రగ్స్ డిటెక్షన్ కిట్‌తో పరీక్షించగా, అది గంజాయి అని నిర్ధారణ అయింది. దీంతో అధికారులు వెంటనే సదరు ప్రయాణికుడిని నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్‌డీపీఎస్) యాక్ట్, 1985 ప్రకారం అరెస్ట్ చేశారు. సరుకును మొత్తం సీజ్ చేసి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. అంతర్జాతీయ మార్గాల ద్వారా హైదరాబాద్‌కు అధిక నాణ్యత గల గంజాయి స్మగ్లింగ్‌ను అరికట్టే ప్రయత్నాల్లో భాగంగా ఈ పట్టివేత జరిగిందని అధికారులు తెలిపారు. దర్యాప్తు కొనసాగుతున్నందున నిందితుడి వివరాలను ఇంకా వెల్లడించలేదు.

ఐఏఎస్ ఆమ్రపాలి కేడర్ తీర్పు రిజర్వ్

హైదరాబాద్, అక్టోబర్ 13 (ఈవార్తలు): సీనియర్ ఐఏఎస్ అధికారిణి ఆమ్రపాలి తన క్యాడర్ కేటాయింపు వివాదంపై దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ ముగిసింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. దీంతో ఆమె క్యాడర్ కేటాయింపుపై నెలకొన్న ఉత్కంఠ కొనసాగుతోంది. రాష్ట్ర విభజన అనంతరం కేంద్ర ప్రభుత్వం ఆమ్రపాలిని ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు కేటాయించింది. అయితే, కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులను సవాలు చేస్తూ ఆమ్రపాలి కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ (క్యాట్)ను ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన క్యాట్, ఆమెను ఏపీకి కేటాయిస్తూ జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను రద్దు చేయడంతో పాటు, తెలంగాణ క్యాడర్‌కు కేటాయించాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే, క్యాట్ వెలువరించిన ఈ తీర్పుపై తెలంగాణ హైకోర్టు గతంలో స్టే విధించింది. దీంతో క్యాట్ ఆదేశాల అమలు నిలిచిపోయింది. హైకోర్టు ఇచ్చిన ఈ స్టే ఉత్తర్వులను సవాలు చేస్తూ ఆమ్రపాలి ఉన్నత న్యాయస్థానంలోనే మరో పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం, ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. హైకోర్టు వెలువరించే తుది తీర్పుతో ఆమ్రపాలి క్యాడర్ కేటాయింపు వ్యవహారంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

జీవో 134 కక్ష సాధింపే: ఆర్ఎస్పీ



హైదరాబాద్, అక్టోబర్ 13 (ఈవార్తలు): తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 134 రాజ్యాంగ విరుద్ధమని, రాజకీయ కక్ష సాధింపు చర్య అని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రంగా ఆరోపించారు. ఈ అంశంపై అసెంబ్లీలో ఏకపక్షంగా చర్చ జరిగిందని ఆయన విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ జీవో రాజ్యాంగంలోని ఆర్టికల్ 14ను ఉల్లంఘిస్తోందని, చట్టం ముందు సమానత్వం అనే సూత్రాన్ని ఇది దెబ్బతీస్తోందని ప్రవీణ్ కుమార్ అన్నారు. ఈ ఉత్తర్వుల జాబితాలో కేవలం బీఆర్ఎస్ నాయకుల భూములే ఉన్నాయని, ఇది ఉద్దేశపూర్వకంగా చేసిన కుట్ర అని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఇతర మంత్రులు ముందే ప్రణాళిక వేసుకుని ఈ జీవోను తీసుకొచ్చారని విమర్శించారు. సెప్టెంబర్ 7న ఉద్దేశపూర్వకంగానే తమ పార్టీ నేతలను అసెంబ్లీలోకి రాకుండా అడ్డుకున్నారని, చర్చలో పాల్గొనకుండా అసాధారణ రీతిలో సస్పెండ్ చేశారని ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని పలు సమస్యలపై మాట్లాడేందుకు బీఆర్ఎస్ నేతలు సిద్ధమైనా, వారికి అవకాశం ఇవ్వలేదని వాపోయారు. భూవివాదాలను పరిశీలించే కమిటీ.. రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో పాటు ఇతర కాంగ్రెస్ నేతల భూములపై కూడా విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూకు లేఖ రాసినట్లు ప్రవీణ్ కుమార్ తెలిపారు.

కరెంటే దిక్కులేదు..

బుల్లెట్ ట్రైనా?: సబిత



హైదరాబాద్, అక్టోబర్ 13 (ఈవార్తలు): తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కుంటోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత సబితా ఇంద్రారెడ్డి తీవ్రస్థాయిలో ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఇంకా అలైన్‌మెంట్ ఖరారు చేయని బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ చేపట్టడం పూర్తిగా చట్టవిరుద్ధమని ఆమె మండిపడ్డారు. కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటనను ప్రస్తావిస్తూ, బుల్లెట్ ట్రైన్ రూట్ మ్యాప్ ఇంకా ఖరారు కాలేదని, అలాంటప్పుడు బహదూర్‌గూడలో పోలీసుల రక్షణతో రైతుల భూములను ఎందుకు తీసుకున్నారని సబిత ప్రశ్నించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాలను ప్రభుత్వం అనవసరంగా సేకరిస్తోందని, సీఎం రేవంత్ రెడ్డికి ఇంత భూదాహం ఎందుకో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులను పంటలు వేయవద్దని సలహా ఇస్తోందని... కనీసం కరెంట్, సాగు, తాగునీరు కూడా అందించలేని దుస్థితిలో ఉందని ఆమె విమర్శించారు. మెట్రో టెండర్లు రద్దు చేసిన ప్రభుత్వం ఇప్పుడు బుల్లెట్ ట్రైన్ల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. కొత్వాల్‌గూడ నుంచి కొడంగల్‌కు కొత్త రహదారి అవసరం ఏముందని నిలదీశారు. భూములు అమ్మి పాలన చేయాలని ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. నాదర్‌గూల్‌లోని ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, భూసేకరణ ఒత్తిడితో కొడంగల్ నియోజకవర్గంలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇలాంటి కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని ఆమె హితవు పలికారు.

ఆర్ఐఎన్ఎల్ భూములకు
రూ.366 కోట్ల బిడ్లు

తొలిరోజే 150 ప్లాట్ల విక్రయం.. రిజర్వు ధర కంటే 17.23 శాతం అధికం



వైజాగ్, అక్టోబర్ 13 (పీఐబీ): విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను నిర్వహిస్తున్న రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్)కు చెందిన భూముల ఈ-వేలంలో తొలిరోజే రూ.366.33 కోట్ల విలువైన బిడ్లు నమోదయ్యాయి. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థల విభాగం ఆధ్వర్యంలో పనిచేసే నేషనల్ ల్యాండ్ మానిటైజేషన్ కార్పొరేషన్ (ఎన్ఎల్ఎంసీ) ఈ ప్రక్రియను నిర్వహించింది. సంస్థ చేపట్టిన తొలి పూర్తిస్థాయి ఈ-వేలం కావడం విశేషం. మొదటి దశలో వేలానికి ఉంచిన భూముల్లో 150 ప్లాట్లు అమ్ముడయ్యాయి. వీటి రిజర్వు ధర రూ.312.48 కోట్లు కాగా, విజయవంతమైన బిడ్ల మొత్తం విలువ రూ.366.33 కోట్లకు చేరింది. దీంతో రిజర్వు ధర కంటే సగటున 17.23 శాతం అధికంగా బిడ్లు నమోదయ్యాయి. ఈ ఫలితాలు వేలంలో ఉంచిన భూములపై కొనుగోలుదారుల నుంచి మంచి స్పందన లభించినట్లు సూచిస్తున్నాయి. వేలంలో చదరపు గజానికి గరిష్ఠ ధర రూ.1.80 లక్షలు దాటింది. విశాఖపట్నంలోని అనుకూల ప్రాంతాల్లో ఉన్న భూములకు బలమైన గిరాకీ ఉందని ఈ ధరలు తెలియజేస్తున్నాయి. ప్రభుత్వ మిగులు ఆస్తుల విలువను వెలికితీసేందుకు పారదర్శకంగా, పోటీతత్వంతో కూడిన ఆన్‌లైన్ వేలం విధానం దోహదపడుతుందని ఎన్ఎల్ఎంసీ పేర్కొంది. ఆర్ఐఎన్ఎల్ సమన్వయంతో ఎన్ఎల్ఎంసీ వేలం ప్రక్రియకు ఏర్పాట్లు చేసింది. క్విక్‌కర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ లావాదేవీల సలహాదారుగా వ్యవహరించగా, రైల్‌టెల్ ఈ-నివిదా వేదిక ద్వారా ఆన్‌లైన్ బిడ్డింగ్ నిర్వహించారు.

రైతు డిస్కమ్‌పై హరీశ్ రావు ఫైర్

ఉచిత విద్యుత్‌కు ఎసరు పెట్టే కుట్రేనని ఆరోపణ



హైదరాబాద్, అక్టోబర్ 13 (ఈవార్తలు): తెలంగాణలో రైతుల కోసం ప్రత్యేకంగా 'రైతు డిస్కమ్' ఏర్పాటు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో 17పై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇది వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ను దూరం చేసే కుట్ర అని ఆయన ఆరోపించారు. ఈ జీవోను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్, ఇతర రాజకీయ పార్టీలు, ఉద్యోగ సంఘాలు, విద్యుత్ రంగ నిపుణులు, రైతుల అభ్యంతరాలను కాంగ్రెస్ ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని హరీశ్ విమర్శించారు. "రైతు డిస్కమ్ ఏర్పాటు జీవో జారీ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ, దుర్మార్గ వైఖరికి నిదర్శనం. ఉచిత విద్యుత్ సరఫరాకు పాతరేసి, అన్నదాత మెడకు ఊరేసేందుకేనా ఈ కుట్ర?" అని హరీశ్ రావు ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ జీవో ప్రకారం 30,60,861 వ్యవసాయ కనెక్షన్లు, 512 ఎత్తిపోతల పథకాలతో పాటు హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ, మిషన్ భగీరథ కనెక్షన్లు కలిపి మొత్తం 30,62,853 కనెక్షన్లను కొత్త డిస్కమ్‌కు బదిలీ చేస్తున్నారని హరీశ్ రావు తెలిపారు. ఇంత పెద్ద వ్యవస్థను కేవలం 2,000 మంది సిబ్బందితో ఎలా నిర్వహిస్తారని ఆయన ప్రశ్నించారు. కొత్త డిస్కమ్‌కు కేవలం 25 శాతం థర్మల్ విద్యుత్‌ను కేటాయించి, 58 శాతం సౌర, మిగిలింది జల విద్యుత్‌పై ఆధారపడటం అవివేకమన్నారు. సౌర విద్యుత్ పగలు మాత్రమే అందుబాటులో ఉంటుందని, జల విద్యుత్ ఏడాదిలో మూడు, నాలుగు నెలలే లభిస్తుందని గుర్తుచేశారు. ఈ పరిస్థితుల్లో రైతులకు 24 గంటల నిరంతర ఉచిత విద్యుత్ ఎలా సాధ్యమవుతుందని సందేహం వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పడే సంస్థపై అప్పులు, బకాయిల భారం మోపడంపైనా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం కొత్త సంస్థలను ఏర్పాటు చేస్తే రైతుల కరెంట్ కష్టాలు తీరవని, వెంటనే జీవో 17ను వెనక్కి తీసుకుని, ఉచిత విద్యుత్ కొనసాగింపుపై రాతపూర్వక హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

విశాఖపట్నం మేయర్ రేసులో
బాలయ్య చిన్న కూతురు!

వైజాగ్, అక్టోబర్ 13 (ఈవార్తలు): 'గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్' (జీవీఎంసీ) ఎన్నికల సందడి మొదలైంది. మేయర్ పీఠానికి రిజర్వేషన్ ఖరారు కావడంతో, నగరం రాజకీయంగా వేడెక్కింది. ఈసారి విశాఖ మేయర్ పదవిని 'జనరల్ మహిళ'కు కేటాయించడంతో, ప్రధాన రాజకీయ పార్టీలైన టీడీపీ, వైఎస్సార్‌సీపీలు తమ అభ్యర్థుల ఎంపికపై తీవ్రంగా దృష్టి సారించాయి. సామాజిక సమీకరణాలను బేరీజు వేసుకుంటూ, గెలుపు గుర్రాలను ఎంపిక చేసే పనిలో నిమగ్నమయ్యాయి. ప్రస్తుతం సోషల్ మీడియాలో, రాజకీయ వర్గాల్లో పలువురి పేర్లు విస్తృతంగా ప్రచారంలో ఉన్నాయి. టీడీపీ నుంచి నందమూరి బాలకృష్ణ రెండో కుమార్తె, విశాఖ ఎంపీ శ్రీభరత్ అర్ధాంగి తేజస్విని పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. అదేవిధంగా ఏపీ టీడీపీ అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అర్ధాంగి లావణ్య పేరు కూడా తెరపైకి వచ్చింది. వీరితో పాటు మాజీ కార్పొరేటర్ ముక్కా శ్రావణి, మరో ప్రముఖ వ్యాపారవేత్త కుమార్తె పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, ఇవన్నీ ప్రస్తుతానికి ఊహాగానాలే అయినా, అధిష్ఠానం త్వరలోనే బలమైన అభ్యర్థిని ఖరారు చేసేందుకు కసరత్తు చేస్తోంది. మరోవైపు వైసీపీలో కూడా మేయర్ అభ్యర్థిత్వం కోసం గట్టి పోటీ నెలకొంది. మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అర్ధాంగి, మాజీ ఎంపీ అయిన బొత్స ఝాన్సీ పేరు బలంగా వినిపిస్తోంది. ఆమెకు రాజకీయంగా మంచి అనుభవం ఉండటం కలిసొచ్చే అంశం. అలాగే, మరో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అర్ధాంగి హిమగౌరి, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, అనకాపల్లి మాజీ ఎంపీ బీశెట్టి సత్యవతి పేర్లు కూడా రేసులో ఉన్నాయి. వైసీపీ అధిష్ఠానం సైతం సామాజిక వర్గాల వారీగా అభ్యర్థి ఎంపికపై లెక్కలు వేస్తోంది. గ్రేటర్ విశాఖ చరిత్రలో ఇప్పటివరకు ఇద్దరు మహిళలు మేయర్లుగా బాధ్యతలు నిర్వర్తించారు. జీవీఎంసీ ఏర్పడక ముందు కాంగ్రెస్ పార్టీ తరఫున రాజాన రమణి (2000-2005), ఆ తర్వాత 2021 నుంచి వైసీపీ తరఫున గొలగాని హరి వెంకట కుమారి మేయర్‌గా పనిచేశారు. ప్రధాన పార్టీలు ప్రముఖుల కుటుంబ సభ్యుల పేర్లను పరిశీలిస్తుండటంతో ఈసారి మేయర్ ఎన్నికలు అత్యంత రసవత్తరంగా మారనున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

అన్నపూర్ణాదేవిగా కనకదుర్గమ్మ దర్శనం

విజయవాడ, అక్టోబర్ 13 (ఈవార్తలు): విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజైన మంగళవారం, కనకదుర్గమ్మ వారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. తెల్లవారుజాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. 'అన్నం పరబ్రహ్మ స్వరూపం' అని ఉపనిషత్తులు ఉద్ఘాటించాయి. జీవకోటికి ప్రాణాధారమైన అన్నాన్ని ప్రసాదించే సాక్షాత్తు దేవతగా అన్నపూర్ణాదేవిని భక్తులు ఆరాధిస్తారు. ఈ అలంకారంలో అమ్మవారు తన వామ హస్తంలో అమృతాన్నంతో నిండిన బంగారు పాత్రను, కుడి చేతిలో రత్నాలు పొదిగిన గరిటెను ధరించి, ఆదిదేవుడైన పరమేశ్వరుడికి భిక్షను సమర్పిస్తున్న దివ్య రూపంలో భక్తులను అనుగ్రహిస్తున్నారు. ఈ స్వరూపంలో ఉన్న అమ్మవారిని దర్శించుకుంటే అన్నదానం చేసిన పుణ్యఫలం దక్కుతుందని, తమ ఇళ్లలో అన్నానికి లోటు ఉండదని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఆలయ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరడంతో ఇంద్రకీలాద్రి పరిసరాలు పండుగ శోభతో కళకళలాడుతున్నాయి.

దసరాకు 750కి పైగా ప్రత్యేక రైళ్లు

సికింద్రాబాద్, అక్టోబర్ 13 (ఈవార్తలు): పండుగ సీజన్ దృష్ట్యా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. దసరా, దీపావళి పండుగల సందర్భంగా 750కి పైగా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ప్రకటించింది. ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండే మార్గాల్లో ఈ ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉంటాయని వెల్లడించింది. ఈ వివరాలను దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్ఓ శ్రీధర్ మంగళవారం మీడియాకు వెల్లడించారు. ప్రయాణికుల అవసరాలు, రద్దీకి అనుగుణంగా రైళ్ల సంఖ్యను మరింత పెంచేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన వివరించారు. పండుగల వేళ ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా స్టేషన్లలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా అదనపు టికెట్ కౌంటర్లను ఏర్పాటు చేయడంతో పాటు, భద్రత దృష్ట్యా సీసీ కెమెరాల ద్వారా నిఘాను కట్టుదిట్టం చేసినట్లు పేర్కొన్నారు. అయితే, ఈ ప్రత్యేక రైళ్లలో ప్రయాణించే వారు సాధారణ ఛార్జీల కంటే కొంత అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ రైళ్లలో మూడో వంతు మేర అదనపు ఛార్జీని వసూలు చేయనున్నట్లు రైల్వే శాఖ స్పష్టం చేసింది.



మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజానమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.

హాస్టళ్లకు సరుకుల సరఫరా స్థానికులకే ఇవ్వాలి: హరీశ్ రావు

హైదరాబాద్, అక్టోబర్ 13 (ఈవార్తలు): రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలకు సరకుల సరఫరా చేసే విధానంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సరకుల సరఫరా కోసం నూతనంగా ప్రవేశపెట్టిన పీఎంయూ (ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్) టెండర్లను తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విధానం స్థానిక చిరు వ్యాపారుల ప్రయోజనాలను తీవ్రంగా దెబ్బతీస్తుందని ఆరోపించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ, గతంలో మాదిరిగానే పాఠశాలను ఒక యూనిట్‌గా పరిగణించి, డీపీసీ (జిల్లా కొనుగోలు కమిటీ) ద్వారా స్థానిక వ్యాపారులకే సరఫరా బాధ్యతలు అప్పగించాలని స్పష్టం చేశారు. అప్పుడే చిరు వ్యాపారులకు భరోసా ఉంటుందని, విద్యార్థులకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందుతాయని పేర్కొన్నారు. స్థానిక వ్యాపారులకు అవకాశం ఇవ్వకుండా ఒకే సంస్థకు టెండర్లు అప్పగించడం వెనుక భారీగా కమీషన్ల ప్రయోజనాలు ఉన్నాయని ఆయన విమర్శించారు. "కేవలం కమీషన్ల కోసం కక్కుర్తిపడి, ఇప్పటికే బ్లాక్‌లిస్ట్‌లో ఉన్న ఒక సంస్థకు టెండర్లు కట్టబెట్టడం అత్యంత దుర్మార్గమైన చర్య" అని హరీశ్‌రావు మండిపడ్డారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃసమీక్షించుకుని పాత విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఒకవేళ తమ డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోని పక్షంలో, రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటం నిర్వహిస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

విదేశీ శక్తులతో కలిసి కమ్యూనిస్టుల కుట్ర: కిషన్ రెడ్డి



న్యూఢిల్లీ: దేశంలో అరాచకం సృష్టించేందుకు కమ్యూనిస్టులు, కాంగ్రెస్ పార్టీలు విదేశీ శక్తులతో కలిసి కుట్ర పన్నుతున్నాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఢిల్లీలో నిరసనల పేరుతో ఈ పార్టీలు ఉద్దేశపూర్వకంగా దేశ ఆర్థిక వ్యవస్థను, శాంతిభద్రతలను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నాయని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన కిషన్ రెడ్డి... కమ్యూనిస్టుల పాత్రపై ప్రత్యేకంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. "కాంగ్రెస్, కమ్యూనిస్టులు చేస్తున్న ధర్నాల వల్ల ఢిల్లీ మార్కెట్ పూర్తిగా దెబ్బతింది. దసరా, దీపావళి వంటి పండుగ సీజన్‌లో చిన్న దుకాణదారులు సరుకులు తెచ్చుకోలేని దుస్థితిని కల్పించారు. కుట్రపూరితంగా ఢిల్లీ ప్రజల జీవనాన్ని అస్తవ్యస్తం చేస్తూ వ్యాపారుల పొట్ట కొడుతున్నారు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ తన స్థాయిని మరిచి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. రాహుల్ గాంధీ, కాంగ్రెస్, కమ్యూనిస్టులు ప్రజాస్వామ్య హక్కులను దుర్వినియోగం చేస్తూ దేశ ప్రతిష్టను మంటగలుపుతున్నారని విమర్శించారు. ప్రధాని మోదీ, అమిత్ షా, అజిత్ దోవల్‌ను లక్ష్యంగా చేసుకుని బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తమకు అనుకూలంగా తీర్పులు రాలేదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కూడా గద్దె దిగమనడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని కిషన్ రెడ్డి దుయ్యబట్టారు. ప్రభుత్వంపై విమర్శలు చేయడంలో తప్పులేదని, కానీ రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేసేలా వ్యవహరించడం దారుణమని ఆయన పేర్కొన్నారు.



ఆలయ అభివృద్ధికి రూ.25,116 విరాళం

వేములవాడ అర్బన్, అక్టోబర్ 13 (ఈవార్తలు): వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధి, విస్తరణ పనుల కోసం కరీంనగర్ సప్తగిరి కాలనీకి చెందిన కేతిరెడ్డి మల్లారెడ్డి, సుజాత దంపతులు రూ.25,116 విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయ వీఆర్వో పెరిక శ్రీనివాస్‌కు సమర్పించారు. అనంతరం దేవస్థానం అధికారులు దాతలకు స్వామివారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందజేశారు.



2013 రోజులుగా అన్నదాన సేవలు

వేములవాడ అర్బన్, అక్టోబర్ 13 (ఈవార్తలు): మై వేములవాడ అన్నదాన సేవా ట్రస్టు ఆధ్వర్యంలో దాతల సహకారంతో పేదలకు అన్నదాన కార్యక్రమం కొనసాగుతోంది. వరుసగా 2013 రోజులుగా సేవలు అందిస్తున్నట్లు ట్రస్టు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం స్థానిక టీటీడీ ధర్మశాల సమీపంలోని రాజన్న-భీమన్న ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. నెల్లూరుకు చెందిన మోహన్‌చంద్ర, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు ప్రణయ్‌చంద్ర పుట్టినరోజు సందర్భంగా ఈ రోజు అన్నదానానికి విరాళం అందించారు. ట్రస్టు శాశ్వత అన్నదాన సభ్యులుగా డా. జువ్వాడి వెంకటేశ్వరరావు, స్నేహాలత, ప్రతాప స్వప్న, సంపత్, నగుబోతు రవీందర్, జ్యోతి, గణాచారి మఠం శైలజ, సాంబశివు, దేవరాజు, ఉమ, బాలచందర్‌రాజు దంపతులు, రామడుగు శ్రీలత కుటుంబ సభ్యులు, హైదరాబాద్‌కు చెందిన చిన్నారులు శ్రీహర్ష, సాయికృష్ణ ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు. పుట్టినరోజు, పెళ్లిరోజు వంటి సందర్భాల్లో పేదలకు ఒకపూట అన్నదానం చేయాలనుకునేవారు ట్రస్టు సభ్యులను లేదా 9246939388 నంబరును సంప్రదించాలని నిర్వాహకుడు మధు మహేష్ కోరారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మధు మహేష్, మహమ్మద్ అబ్దుల్ రఫీక్, ప్రతాప నటరాజు, పసుల శ్రీధర్ పాల్గొన్నారు.




నవశక్తి దుర్గామాత సన్నిధిలో కుంకుమార్చన

మల్యాల, అక్టోబర్ 13 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రంలోని శ్రీ నవశక్తి దుర్గామాత ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. మూడో రోజు అమ్మవారు చంద్రఘంటాదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కుంకుమార్చనలు చేశారు. తమ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, ప్రజలందరిపై అమ్మవారి కృపాకటాక్షాలు ఉండాలని ప్రార్థించారు.

కనకదుర్గ ఆలయంలో శివ పటేల్ జన్మదిన వేడుకలు

కూకట్‌పల్లి, అక్టోబర్ 13 (ఈవార్తలు): జవహర్‌నగర్ కాలనీలోని శ్రీ కనకదుర్గాదేవి ఆలయంలో సీనియర్ పాత్రికేయుడు ఆర్.కే. రాజు పటేల్ కుమారుడు శివ పటేల్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. నవజీవన్ ఆర్ కాలనీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న రాజు పటేల్ కుటుంబ సభ్యులు, కాలనీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు కాశీనాథ్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి వేద మంత్రోచ్చారణల మధ్య శివ పటేల్‌ను ఆశీర్వదించారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జవహర్‌నగర్ కాలనీ అధ్యక్షుడు కే. రాము ముదిరాజ్, కమిటీ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, రవి, కాలనీ పెద్దలు, సభ్యులు శివ పటేల్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పూజల అనంతరం కుటుంబ సభ్యులు, కాలనీ నాయకులు ఆయనను ఆశీర్వదించారు.



అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి అండ



ధర్మపురి, అక్టోబర్ 13 (ఈవార్తలు): ఎండపల్లిలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన దాసరి కొమురయ్య కుటుంబాన్ని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మద్దుల గోపాల్‌రెడ్డి పరామర్శించారు. బాధిత కుటుంబానికి తక్షణ అవసరాల కోసం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వ పరంగా సహాయం అందేలా కృషి చేయడంతోపాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కొమురయ్య తన భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల ఇంట్లో జరిగిన అగ్నిప్రమాదంలో బంగారం, దుస్తులు, గృహోపకరణాలతోపాటు పిల్లల చదువుకు సంబంధించిన ధ్రువపత్రాలు కాలిపోయాయి. అనారోగ్యంతో ఉన్న తండ్రి వైద్య ఖర్చుల కోసం అప్పుగా తెచ్చిన నగదు కూడా అగ్నికి ఆహుతైంది. దీంతో కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో పడింది. విషయం తెలుసుకున్న గోపాల్‌రెడ్డి బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సహకారంతో ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యేలా కృషి చేస్తానని తెలిపారు. ఇల్లు మంజూరైన తర్వాత నిర్మాణానికి, ఆ సమయంలోనూ తమ వంతు సాయం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గూడ రాంరెడ్డి, ఎండపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గెల్లు చంద్రశేఖర్, మండల ప్రధాన కార్యదర్శి కందికట్ల రాజేష్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సంగ రమేష్, జి.రెడ్డి మహేందర్‌రెడ్డి, పడిధం లావణ్య మొగిలి, బెడ్డల ప్రవీణ్, బాలసాని శారద మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



ఓవర్‌లోడ్‌తో గుట్టపై నిలిచిన ఆర్టీసీ బస్సు

జగిత్యాల, అక్టోబర్ 13 (ఈవార్తలు): కొల్వాయి నుంచి జగిత్యాలకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు మంగళవారం ప్రయాణికుల రద్దీతో బీర్‌పూర్ గుట్టపై నిలిచిపోయింది. గుట్ట ఎక్కుతున్న సమయంలో బస్సు ఒక్కసారిగా ఆగిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బస్సులో సుమారు 100 మందికి పైగా ఉన్నట్లు తెలిసింది. బస్సు ముందుకు కదలకపోవడంతో ప్రయాణికులంతా కిందికి దిగి గుట్టపై నుంచి నడుచుకుంటూ వెళ్లారు. గుట్ట ఎక్కిన తర్వాత తిరిగి బస్సులోకి ఎక్కి ప్రయాణాన్ని కొనసాగించారు. బస్సులో పరిమితికి మించి ప్రయాణికులు ఉండటమే ఈ పరిస్థితికి కారణమని స్థానికులు పేర్కొంటున్నారు. బస్సు సిబ్బంది సూచించినప్పటికీ ప్రయాణికులు పట్టించుకోలేదని సమాచారం. గతంలో ఇదే గుట్టపై ఆర్టీసీ బస్సు బోల్తాపడి ప్రాణనష్టం జరిగిన నేపథ్యంలో ప్రయాణికుల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులు నడపాలని బీర్‌పూర్ మండల ప్రజలు ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు. ఓవర్‌లోడ్‌ను నివారించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అట్రాసిటీ బాధితులకు సత్వర న్యాయం



జగిత్యాల, అక్టోబర్ 13 (ఈవార్తలు): ఎస్సీ, ఎస్టీలపై అఘాయిత్యాల నిరోధక చట్టం అమలులో భాగంగా బాధితులకు సత్వర న్యాయం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి విజిలెన్స్, పర్యవేక్షణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు 79 అట్రాసిటీ కేసులు నమోదయ్యాయని, వాటిలో 20 కేసులు నిరూపితమయ్యాయని, మిగిలినవి న్యాయస్థానాల పరిధిలో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. బాధితులకు మొత్తం రూ.7.60 కోట్ల పరిహారం చెల్లించాల్సి ఉండగా, ఇప్పటివరకు రూ.6.90 కోట్లు అందించామని వివరించారు. మిగిలిన రూ.79 లక్షలు ప్రభుత్వ స్థాయిలో పెండింగ్‌లో ఉన్నాయని, కలెక్టరేట్ స్థాయిలో పరిహార ప్రతిపాదనలు పెండింగ్‌లో లేవని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీల హక్కులపై అవగాహన కల్పించేందుకు ప్రతి నెల గ్రామస్థాయిలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కుల ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులను పరిశీలించి అర్హులకు సకాలంలో అందించాలని ఆదేశించారు. కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ బాధితులు ఫిర్యాదుల కోసం పోలీస్‌స్టేషన్లకు వచ్చినప్పుడు అధికారులు సానుకూలంగా స్పందించాలని కోరారు. దసరా వేడుకల్లో కుల వివక్షకు తావులేకుండా అన్ని వర్గాల ప్రజలు సమానంగా పాల్గొనేలా చూడాలని సూచించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్, కమిటీ సభ్యులు, ఆర్డీఓలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



దివ్యాంగుల వాహనాల రిజిస్ట్రేషన్‌కు పరిష్కారం

కోరుట్ల, అక్టోబర్ 13 (ఈవార్తలు): ప్రభుత్వం దివ్యాంగులకు ఉచితంగా పంపిణీ చేసిన టీవీఎస్ జూపిటర్ రెట్రోఫిటెడ్ వాహనాల శాశ్వత రిజిస్ట్రేషన్‌లో తలెత్తిన సమస్య పరిష్కారానికి జిల్లా సంక్షేమ శాఖ చర్యలు చేపట్టింది. అవసరమైన ధ్రువపత్రాలు అందుబాటులో లేకపోవడంతో జగిత్యాల, కోరుట్ల ఆర్టీఓ కార్యాలయాల్లో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని దివ్యాంగులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో జిల్లా సంక్షేమ అధికారి డా. ఆడేపు భాస్కర్ ఆదేశాల మేరకు అధికారులు జిల్లా రవాణా అధికారి సమ్దానీ అహ్మద్‌తో చర్చించారు. హైదరాబాద్‌లోని కిరణ్ టీవీఎస్ నిర్వాహకులతో మాట్లాడి పెండింగ్ పత్రాలను తెప్పించి జిల్లా రవాణా అధికారికి అందజేశారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, దివ్యాంగుల సంఘ నాయకులు అస్గర్ మొహమ్మద్ ఖాన్, రాజేష్, లబ్ధిదారుడు అనిల్ పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలి

పెండింగ్ కేసులపై ధర్మపురి కోర్టు న్యాయమూర్తి సమీక్ష



ధర్మపురి, అక్టోబర్ 13 (ఈవార్తలు): పెండింగ్ కేసుల త్వరిత పరిష్కారానికి పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ధర్మపురి కోర్టు న్యాయమూర్తి వై. జానకి సూచించారు. పోలీసు అధికారులతో నిర్వహించిన సమావేశంలో పెండింగ్ కేసులు, నాన్ బెయిలబుల్ వారెంట్లు, సాక్షుల హాజరు తదితర అంశాలపై చర్చించారు. కేసుల విచారణలో జాప్యం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం లీగల్ ఎయిడ్ కౌన్సిల్ జాజాల రమేష్‌తో కలిసి కేసుల వివరాలు, ఖైదీలకు అందిస్తున్న న్యాయ సహాయంపై సమీక్షించారు. న్యాయ సహాయం అవసరమైన వారికి తగిన సహకారం అందించే అంశాలను చర్చించారు. సమావేశంలో ధర్మపురి ఎస్ఐ సదాకర్, వెల్గటూర్ ఎస్ఐ ఉదయ్, బుగ్గారం ఎస్ఐ శ్రీకాంత్, ఎక్సైజ్ ఎస్ఐ జమీల్, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ జాజాల రమేష్ పాల్గొన్నారు.



భూభారతి లీ సర్వేపై అవగాహన

గంగాధర, అక్టోబర్ 13 (ఈవార్తలు): కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధర మండలం నాగిరెడ్డిపూర్ గ్రామంలో భూభారతి పునఃసర్వేపై అవగాహన సదస్సు నిర్వహించారు. భూ సర్వే ప్రక్రియ, భూములకు సంబంధించిన రికార్డులు, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గునుకొండ యశోద-బాబు, ఉపసర్పంచ్ పంజాల క్రిష్ణ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కిషన్‌రావు, తహసీల్దార్ అంబటి రజిత, మండల సర్వేయర్ కుమార్, గిర్దావర్ రాజ్‌కుమార్, జీపీఓ మమత, ఏఈఓ గోవర్ధన్, రైతులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ నన్ను తోసేశారు

గర్భిణీ జర్నలిస్ట్ సంచలన ఆరోపణ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ఒక మహిళా జర్నలిస్ట్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఢిల్లీలో సుప్రీంకోర్టు సమీపంలో జరిగిన నిరసన కార్యక్రమంలో రాహుల్ తన చేయి పట్టుకుని లాగి, తోసేశారని ఆమె ఆరోపించారు. మూడు నెలల గర్భిణి అయిన జర్నలిస్ట్ రిచా పరాశర్ ఈ ఘటన తర్వాత ఆసుపత్రిలో చేరారు. అయితే, ఈ ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. ఇదంతా బీజేపీ చేస్తున్న దుష్ప్రచారం అని కొట్టిపారేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిన్న ఇండియా కూటమి నిరసన చేపట్టింది. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ నుంచి సౌండ్‌బైట్ తీసుకునేందుకు ప్రయత్నించానని రిచా తెలిపారు. ఆ సమయంలో రాహుల్ తన చేయి పట్టుకుని దూకుడుగా లాగారని, వెంటనే ఆయన బాడీగార్డులు కూడా తోసేయడంతో మెట్లపై పడిపోయానని ఆమె వాపోయారు. తన కెమెరామెన్‌ను కూడా తోయడంతో అతను తనపై పడ్డాడని వివరించారు. ఈ ఘటనపై బీజేపీ నేతలు తీవ్రంగా స్పందించారు. పలువురు నేతలు ఆసుపత్రికి వెళ్లి రిచాను పరామర్శించారు. రాహుల్ తీరుపై కేంద్ర మంత్రి అన్నపూర్ణా దేవి మండిపడ్డారు. మరోవైపు, కాంగ్రెస్ నేత అల్కా లాంబా ఈ ఆరోపణలను తోసిపుచ్చారు. జర్నలిస్ట్ ఆసుపత్రిలో చేరిన సమయం, గర్భవతిగా ఉన్నప్పుడు ఎక్స్‌రే తీయడం వంటి అంశాలపై ఆమె సందేహాలు వ్యక్తం చేశారు. ఇది బీజేపీ ఆడిస్తున్న నాటకమని కాంగ్రెస్ వర్గాలు ఆరోపిస్తున్నాయి.

డాలర్‌పై రూపాయి జోరు

ముంబై: అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ వరుసగా రెండో రోజూ భారీగా బలపడింది. మంగళవారం ఉదయం ఫారెక్స్ మార్కెట్లో రూపాయి ఏకంగా 77 పైసలు లాభపడి 95.05 వద్ద ట్రేడ్ అవుతోంది. డాలర్ డిమాండ్‌ను తగ్గించడం, స్పెక్యులేటివ్ ట్రేడింగ్‌ను అరికట్టడం లక్ష్యంగా ఆర్బీఐ తీసుకున్న కఠిన చర్యలు రూపాయికి అండగా నిలిచాయి. సోమవారం కూడా రూపాయి 93 పైసలు లాభపడి 95.78 వద్ద ముగిసిన విషయం తెలిసిందే. ఆరు నెలల్లో ఒక్కరోజులో ఇంతటి వృద్ధిని నమోదు చేయడం ఇదే తొలిసారి. ఆర్బీఐ తాజాగా తీసుకున్న చర్యల్లో భాగంగా ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల కోసం ప్రత్యేక డాలర్ విండోను ఏర్పాటు చేసింది. దీంతో స్పాట్ మార్కెట్లో డాలర్లకు డిమాండ్ తగ్గుతుందని భావిస్తున్నారు. అంతేగాక కొన్ని ఫారెక్స్ హెడ్జింగ్ లావాదేవీలపై వ్యయాన్ని పెంచడం ద్వారా స్పెక్యులేషన్‌కు అడ్డుకట్ట వేసింది. ఇటీవల రద్దు చేసిన ఫారెక్స్ డెరివేటివ్ కాంట్రాక్టులను మళ్లీ రీబుక్ చేయడానికి వీల్లేదని కూడా ఆర్బీఐ స్పష్టం చేసింది.

ఫ్లైదుబాయ్ ఉగ్రకుట్ర.. మరో ఇద్దరు పైలట్ల అరెస్టు

దుబాయ్: ఫ్లైదుబాయ్ విమానాన్ని హైజాక్ చేసి, ఇజ్రాయెల్‌లో కూల్చివేసేందుకు పన్నిన ఉగ్రకుట్ర కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి దుబాయ్ పోలీసులు మరో ఇద్దరు ఫ్లైదుబాయ్ పైలట్లను అరెస్ట్ చేశారు. విమానాన్ని



తన ఆధీనంలోకి తీసుకునేందుకు ప్రయత్నించిన ఒమన్ పైలట్‌తో వీరికి సంబంధాలు ఉన్నాయని అధికారులు అనుమానిస్తున్నారు. తాజా అరెస్టులతో ఈ కుట్ర పరిధి కేవలం ఒక్కరికే పరిమితం కాదని, దీని వెనుక భారీ నెట్‌వర్క్ ఉందనే అనుమానాలు బలపడుతున్నాయి. గత శనివారం దుబాయ్ పోలీసులు ఆ ఇద్దరు పైలట్లను అదుపులోకి తీసుకున్నారు. వీరిద్దరూ మాల్దీవులకు చెందినవారని, ఫ్లైదుబాయ్‌లో ఇటీవలే విధుల్లో చేరారని సమాచారం. వీరి అరెస్ట్ విషయాన్ని యూఏఈలోని మాల్దీవుల రాయబార కార్యాలయం వారి కుటుంబ సభ్యులకు తెలియజేసినట్లు ఓ మాల్దీవియన్ వార్తా సంస్థ వెల్లడించింది. అయితే, ఈ అరెస్టులపై మాల్దీవుల ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. గత నెల 30న దుబాయ్ నుంచి టెల్ అవీవ్ వెళుతున్న ఫ్లైదుబాయ్ విమానంలో ఒమన్‌కు చెందిన కో-పైలట్ హమామ్ అల్-హమామీ, విమాన కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై గొడ్డలితో దాడి చేసిన విషయం తెలిసిందే. విమానాన్ని తన ఆధీనంలోకి తీసుకుని బెన్ గురియన్ ఎయిర్‌పోర్ట్‌లో కూల్చివేయాలని అతడు కుట్ర పన్నాడు. అయితే కెప్టెన్ స్మిత్ ధైర్యంగా ప్రతిఘటించగా, ఒక ఇజ్రాయెల్ ప్రయాణికుడు కాక్‌పిట్‌లోకి ప్రవేశించి కెప్టెన్‌కు సహాయం చేశాడు. దీంతో విమానాన్ని సౌదీ అరేబియాలోని తబుక్‌కు మళ్లించి సురక్షితంగా ల్యాండ్ చేశారు.



అన్నప్రసాద ట్రస్టుకు రూ.1,01,116 విరాళం

వేములవాడ అర్బన్, అక్టోబర్ 13 (ఈవార్తలు): వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి నిత్య అన్నప్రసాద ట్రస్టుకు పెద్దిరెడ్డి జయవర్ధన్‌రెడ్డి, గ్రీష్మారెడ్డి దంపతులు రూ.1,01,116 విరాళంగా అందజేశారు. తమ కుమారుడు పెద్దిరెడ్డి రుగ్వేద్‌రెడ్డి పేరుతో ఈ మొత్తాన్ని సమర్పించారు. విరాళానికి సంబంధించిన చెక్కును ఆలయ ఏఈఓ లక్ష్మణ్‌రావుకు అందజేశారు. స్వామివారి నిత్య అన్నప్రసాద సేవకు విరాళం అందించిన దాతలను ఆలయ అధికారులు అభినందించారు.

వేములవాడలో అప్రకటిత విద్యుత్ కోతలు

వేములవాడ అర్బన్, అక్టోబర్ 13 (ఈవార్తలు): వేములవాడ పట్టణంలోని వేణుగోపాలస్వామి వీధి, టెంపుల్ రోడ్డు, కుమ్మరిగుడి, పాత కూరగాయల మార్కెట్, మాంసం మార్కెట్ ప్రాంతాల్లో గత ఐదు రోజులుగా విద్యుత్ కోతలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఇంటి పనులు, వృత్తి, ఉద్యోగ కార్యకలాపాలకు ఆటంకం కలుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా విద్యుత్ సరఫరా నిలిపివేయడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతుల కారణంగా కోతలు విధిస్తున్నట్లు అధికారులు చెబుతున్న నేపథ్యంలో, ముందుగానే సమాచారం ఇవ్వాలని, పనులను త్వరగా పూర్తి చేసి నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని ప్రజలు కోరుతున్నారు.

కేంద్రంపై ఉమ్మడి పోరాటం

మోదీ, షా చుట్టూ ఉచ్చు: రాహుల్



న్యూఢిల్లీ: ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం కేంద్ర ప్రభుత్వంపై తమ పోరాటాన్ని కొనసాగిస్తామని విపక్షాలు మంగళవారం స్పష్టం చేశాయి. న్యాయవ్యవస్థ వంటి రాజ్యాంగబద్ధ సంస్థలు ఎలాంటి పాత్ర పోషించినా, పోషించకపోయినా తమ ప్రతిఘటన ఆగదని తేల్చిచెప్పాయి. నిరసనల వేదికగా జంతర్ మంతర్‌కు ఉన్న గుర్తింపును రద్దు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, దీనిపై పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రకటించాయి. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీతో పాటు ఆర్జేడీ, సమాజ్‌వాదీ పార్టీ, సీపీఎం, సీపీఐ, తృణమూల్ కాంగ్రెస్, శివసేన (యూబీటీ) సహా 'ఇండియా' కూటమికి చెందిన పలువురు కీలక నేతలు, విద్యార్థి సంఘాల నాయకులు, పౌర సమాజ ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసనల అనంతరం, తదుపరి కార్యాచరణపై చర్చించేందుకు రాహుల్ ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ, "మాకు సుప్రీంకోర్టు, ప్రధాన న్యాయమూర్తి, న్యాయవ్యవస్థపై అపారమైన గౌరవం ఉంది. వారు తమ బాధ్యతను నిర్వర్తిస్తారని ఆశిస్తున్నాం. ఏ వ్యవస్థ స్పందించినా, స్పందించకపోయినా మా రాజకీయ, ప్రజా ప్రతిఘటన కొనసాగుతుంది, అంతిమంగా విజయం సాధిస్తుంది" అని అన్నారు. రాజ్యాంగాన్ని దెబ్బతీసి అంత సులభంగా తప్పించుకోలేరని ఆయన హెచ్చరించారు. ఓట్ల దొంగతనానికి పాల్పడిన వారిపై చర్యలు తప్పవని పునరుద్ఘాటించారు. "ఈ కుట్రకు ప్రధాన రూపశిల్పి మోదీ కాగా, అమలు చేసిన వ్యక్తులు అమిత్ షా, జ్ఞానేశ్ కుమార్ అని, వారి చుట్టూ ఉచ్చు బిగుస్తోందని వారు గ్రహించాలి. వారందరినీ న్యాయస్థానం ముందు నిలబెడతామని హామీ ఇస్తున్నాం" అని రాహుల్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

జంతర్ మంతర్‌పై పోరాటం

నిరసన ప్రదేశంగా జంతర్ మంతర్ హోదాను ప్రభుత్వం రద్దు చేయడాన్ని పలువురు నేతలు తీవ్రంగా ఖండించారు. "ప్రభుత్వంలోని భయం ఈ నిర్ణయంలో స్పష్టంగా కనిపిస్తోంది" అని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ విమర్శించారు. జంతర్ మంతర్‌ను తిరిగి దక్కించుకోవడానికి పోరాడతామని సీపీఐ నేత డి. రాజా ప్రకటించారు. రాబోయే రోజుల్లో 'ఇండియా' కూటమి చేపట్టే ప్రతీ కార్యక్రమంలోనూ జంతర్ మంతర్ వైపు మార్చ్ చేసే ప్రయత్నం ఉంటుందని కూటమి వర్గాలు తెలిపాయి. సీపీఎం పొలిట్‌బ్యూరో సైతం ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించింది. శాంతియుత నిరసన హక్కును బలహీనపరిచేందుకే ప్రభుత్వం ఈ చర్యకు పాల్పడిందని ఆరోపించింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఇతర నేతలు సైతం బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాజ్యాంగం ప్రమాదంలో పడటంతోనే ప్రజాస్వామ్య శక్తులన్నీ ఏకమయ్యాయని ఎన్సీపీ (ఎస్పీ) ఎంపీ సుప్రియా సూలే అన్నారు. 'ఓట్ల దొంగతనం'లో పాలుపంచుకున్న జ్ఞానేశ్ కుమార్, ఇతర అధికారులపై చర్యలు తీసుకునే వరకు తమ పోరాటం ఆగదని తృణమూల్ నేత సాగరిక ఘోష్ స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో సీఈసీని పదవి నుంచి తప్పించే వరకు ఉద్యమం కొనసాగుతుందని శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ తెలిపారు.

నిరసనకారులను విడదీసే కుట్ర

కేంద్రంపై అభిజిత్ దీప్కే తీవ్ర ఆరోపణలు



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం నిరసనకారుల మధ్య విభేదాలు సృష్టించి, వారి ఐక్యతను దెబ్బతీసేందుకు 'విభజించి పాలించు' అనే కుట్రపూరిత వ్యూహాన్ని అమలు చేస్తోందని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే ఆరోపించారు. ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నియామకానికి వ్యతిరేకంగా సాగుతున్న పోరాటాన్ని నీరుగార్చేందుకు, వివిధ నిరసన బృందాల పట్ల వివక్షాపూరితంగా వ్యవహరిస్తూ వారి మధ్య అపనమ్మకాన్ని, అనుమానాలను రేకెత్తిస్తోందని ఆయన విమర్శించారు. గతంలో సీజేపీ నిరసనకు అనుమతి లభించినప్పుడు, కొందరు తమను బీజేపీ అనుకూల వ్యక్తులుగా చిత్రీకరిస్తూ కుట్ర సిద్ధాంతాలను ప్రచారం చేశారని ఆయన గుర్తు చేశారు. నిన్న ఇండియా కూటమి భారీ నిరసన చేపట్టిన నేపథ్యంలో, అక్టోబర్ 10న తమపై ప్రయోగించిన ఉక్కుపాదాన్ని ప్రభుత్వం వారిపై ప్రయోగించలేదని ఆయన వివరించారు. "ప్రజలను ఒకరిపై ఒకరిని ఉసిగొల్పడమే ఈ ప్రభుత్వ విధానం. ఒక నిరసనను అనుమతించి, మరొకదాన్ని అణిచివేయడం ద్వారా ఒకే లక్ష్యం కోసం పోరాడుతున్న వర్గాల మధ్య అనుమానాలకు ఆస్కారం కల్పిస్తున్నారు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కుట్రపూరిత వ్యూహం వెనుక ఉన్న అంతరార్థాన్ని ప్రతిఒక్కరూ గ్రహించాలని అభిజిత్ దీప్కే కోరారు. "నేడు ఒకరికి అనుమతినిచ్చి, మరొకరిని అణిచివేస్తే ప్రభుత్వం, రేపు దానికి భిన్నంగా వ్యవహరించవచ్చు. అధికారాన్ని ప్రశ్నించడం మానేసి, నిరసనకారులు తమలో తామే కలహించుకునేలా చేయడమే పాలకుల అంతిమ లక్ష్యం" అని ఆయన విశ్లేషించారు. తప్పుడు ప్రచారాలను, కుట్ర సిద్ధాంతాలను నమ్మి విడిపోవద్దని, అంతర్గత విభేదాల ఉచ్చులో పడవద్దని ఆయన ప్రజలకు, వివిధ నిరసన బృందాలకు విజ్ఞప్తి చేశారు. "మనమంతా ఏకతాటిపై నిలబడాల్సిన సమయం ఆసన్నమైంది. మన పోరాటం జ్ఞానేశ్ కుమార్ నియామకంపై, ఆయనను వెనకేసుకొస్తున్న వ్యవస్థపైనే అన్న విషయాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ విస్మరించకూడదు" అని ఆయన స్పష్టం చేశారు.

టెక్నాలజీ ఎఫెక్ట్.. 12 ఏళ్ల తర్వాత నడిచిన యువతి

న్యూఢిల్లీ: సాంకేతికత కొత్త అద్భుతాలను సృష్టిస్తోంది. ఎన్నో ఏళ్లుగా అసాధ్యమనుకున్న వాటిని సుసాధ్యం చేస్తూ, ఎందరి జీవితాల్లోనో వెలుగులు నింపుతోంది. తాజాగా, 12 ఏళ్లుగా పక్షవాతంతో వీల్‌చైర్‌కే పరిమితమైన ఓ యువతి రోబోటిక్ టెక్నాలజీ సహాయంతో మళ్లీ తన కాళ్లపై తాను నిలబడి, అడుగులు వేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ సంఘటన లెబనాన్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. లెబనాన్‌కు చెందిన జెస్సికా టవిల్ అనే యువతి 2014లో తన 16వ ఏట ఘోరమైన కారు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ఆమె వెన్నుపూసకు తీవ్రమైన గాయమైంది. దీనివల్ల ఆమె శరీరంలోని కింది భాగం మొత్తం చచ్చుబడిపోయింది (పారాప్లీజియా). అప్పటి నుంచి ఆమె జీవితం వీల్‌చైర్‌కే పరిమితమైంది. పన్నెండేళ్లుగా ఆమె చక్రాల కుర్చీ సాయంతోనే తన పనులు చేసుకుంటోంది. అయితే, ఇటీవల జెస్సికా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పంచుకున్న ఒక వీడియో ప్రపంచవ్యాప్తంగా వైరల్ అయింది. ఆ వీడియోలో ఆమె 'ఈవ్' అనే ఒక రోబోటిక్ ఎక్సోస్కెలిటన్ పరికరం సహాయంతో నిలబడి, మెల్లగా అడుగులు వేయడం కనిపిస్తుంది. పన్నెండేళ్ల తర్వాత మళ్లీ తన కాళ్లపై నిలబడటంతో ఆమె ఆనందానికి, ఆశ్చర్యానికి అవధుల్లేకుండా పోయాయి. 'ఓ మై గాడ్' అంటూ ఆమె వ్యక్తం చేసిన భావోద్వేగాలు చూసిన వారిని కదిలించాయి. ఈ ఎక్సోస్కెలిటన్ పక్షవాతాన్ని పూర్తిగా నయం చేయదు. కానీ, మెకానికల్ సపోర్ట్‌తో కదలికలను అందించి, నిలబడటానికి, నడవడానికి సహాయపడుతుంది. జెస్సికా తన రోజువారీ పనుల్లో కూడా ఈ పరికరం ఎలా ఉపయోగపడుతోందో చూపించింది. 'ఈవ్' అనే ఈ పరికరానికి ఆగస్టు 2026లో అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ) నుంచి అనుమతి లభించిందని ఆమె తెలిపింది. వెన్నుపూస గాయాలతో బాధపడుతున్న వారికి ఇలాంటి రోబోటిక్ అసిస్టివ్ టెక్నాలజీలు ఒక కొత్త ఆశను చూపిస్తున్నాయి. వైద్య నిపుణుల పర్యవేక్షణలో, వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా ఈ పరికరాలు వారికి నిలబడే, నడిచే అవకాశాన్ని కల్పిస్తున్నాయి. జెస్సికా కథ ఎంతోమందికి స్ఫూర్తినిస్తూ, సాంకేతికత మానవ జీవితాన్ని ఎలా మార్చగలదో నిరూపిస్తోంది.

ఎన్నికల కమిషనర్లకు చట్టపరమైన రక్షణ

కేంద్రం, ఈసీకి సుప్రీంకోర్టు నోటీసులు

న్యూఢిల్లీ: ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ), ఇతర ఎన్నికల కమిషనర్లకు చట్టం ద్వారా కల్పించిన విస్తృత న్యాయపరమైన రక్షణను సవాలు చేస్తూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు మంగళవారం కేంద్ర ప్రభుత్వానికి, భారత ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. ఈ రక్షణ రాజ్యాంగంలోని సమానత్వ హక్కు, భావప్రకటన స్వేచ్ఛకు సంబంధించిన నిబంధనలకు విరుద్ధమని 'అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్' (ఏడీఆర్) తన పిటిషన్‌లో పేర్కొంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై స్పందించింది. కేంద్రం, ఎన్నికల సంఘం తమ సమాధానాలను సమర్పించాలని ఆదేశించింది. తదుపరి విచారణను నవంబర్ 2న చేపట్టే అవకాశం ఉంది. 2023లో తీసుకొచ్చిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఇతర ఎలక్షన్ కమిషనర్ల (నియామకం, సేవా నిబంధనలు, పదవీకాలం) చట్టంలోని సెక్షన్ 16 ఈ వివాదానికి కేంద్రంగా ఉంది. ఈ నిబంధన ప్రకారం.. ఎన్నికల ప్రధాన కమిషనర్‌గా లేదా ఎన్నికల కమిషనర్‌గా పనిచేసిన వ్యక్తి, తన అధికారిక విధుల నిర్వహణలో లేదా విధులు నిర్వహిస్తున్నట్లు భావించి చేసిన చర్యలు, మాట్లాడిన మాటలకు సంబంధించి ఆయనపై సివిల్, క్రిమినల్ కేసులను కోర్టులు స్వీకరించకూడదు. ఇప్పటికే కొనసాగుతున్న అలాంటి కేసులను కూడా కొనసాగించకూడదని ఈ సెక్షన్ పేర్కొంటోంది. ఈ రక్షణ విధుల్లో ఉన్నవారికే కాకుండా, గతంలో ఆ పదవుల్లో పనిచేసినవారికీ వర్తిస్తుంది. అయితే, ఈ నిబంధన రాజ్యాంగబద్ధతనే ఏడీఆర్ సవాలు చేసింది.

కాంగ్రెస్ హయాంలో ఈసీ దుర్వినియోగం: పీయూష్ గోయల్

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ సంచలన ఆరోపణలు చేశారు. ఎన్నికల కమిషనర్ల కార్యాలయాన్ని కాంగ్రెస్ దుర్వినియోగం చేసిందని, పదవీ విరమణ చేసిన అధికారులకు రాజకీయ పదవులను బహుమతులుగా కట్టబెట్టిందని మంగళవారం ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో రాజ్యాంగబద్ధమైన పదవుల్లో నియమితులైన పలువురు అధికారులు, తదనంతరం రాజకీయ లబ్ధి పొందారని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) ఎం.ఎస్. గిల్‌ను ఉదాహరణగా చూపుతూ, ఆయన ఎన్నికల కమిషన్, పార్లమెంట్, కేంద్ర కేబినెట్ల మధ్య వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వర్తించారని పీయూష్ గోయల్ గుర్తుచేశారు. దీనిని రాజకీయ 'బేరసారాలకు' నిదర్శనంగా ఆయన అభివర్ణించారు. అదేవిధంగా, మరో మాజీ సీఈసీ టీ.ఎన్. శేషన్ తన పదవీకాలం ముగిసిన రెండు నెలల్లోకే 1986లో గుజరాత్ గవర్నర్‌గా నియమితులయ్యారని గోయల్ పేర్కొన్నారు. 2005లో నవీన్ చావ్లాను ఎన్నికల కమిషనర్‌గా నియమించడం వెనుక సోనియా గాంధీ పాత్రను పీయూష్ గోయల్ ప్రశ్నించారు. అప్పటి నిబంధనల ప్రకారం నియామకాలకు ప్రధానమంత్రి, ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉండగా, ఆ సమయంలో ప్రభుత్వాన్ని అసలు ఎవరు నడిపారని ఆయన నిలదీశారు. 2009లో అప్పటి సీఈసీ ఎన్. గోపాలస్వామి, నవీన్ చావ్లాను పదవి నుంచి తొలగించాలని కోరిన వైనాన్ని కూడా గోయల్ ప్రస్తావించారు. చావ్లా కాంగ్రెస్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, ఆయన వైఖరిపై గోపాలస్వామి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారని గుర్తుచేశారు. అయితే, నాటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆ అభ్యర్థనను పట్టించుకోలేదని పీయూష్ గోయల్ విమర్శించారు. ప్రభుత్వంపై సోనియా గాంధీ పూర్తి ప్రభావం చూపారని, నాటి ప్రధాని మన్మోహన్ సింగ్‌కు రాహుల్ గాంధీ కనీస గౌరవం కూడా ఇవ్వలేదని ఆయన ఆరోపించారు.

అమెరికాలో 13 రాష్ట్రాలకు బ్లాక్‌అవుట్ ముప్పు

వాషింగ్టన్: అమెరికాలో తీవ్ర విద్యుత్ సంక్షోభం ముంచుకొస్తోంది. దేశంలోనే అతిపెద్ద విద్యుత్ గ్రిడ్ ఆపరేటర్ అయిన పీజేఎం పరిధిలోని 13 రాష్ట్రాలు, వాషింగ్టన్ డీసీలో బ్లాక్‌అవుట్‌లు సంభవించే ప్రమాదం ఏర్పడింది. దీంతో అమెరికా ఇంధన శాఖ వెంటనే రంగంలోకి దిగి, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు కలగకుండా చూసేందుకు అత్యవసర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఆదేశాల ద్వారా సుమారు 6.5 కోట్ల మంది ప్రజలకు విద్యుత్ కోతలు లేకుండా నిరంతరాయంగా సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టింది. శరదృతువులో అనూహ్యంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడం, దీంతో విద్యుత్‌కు డిమాండ్ భారీగా పెరగడం ఈ సంక్షోభానికి ప్రధాన కారణం. అదే సమయంలో, శీతాకాలానికి సన్నద్ధమయ్యే క్రమంలో అనేక విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ప్రణాళికాబద్ధమైన నిర్వహణ (మెయింటెనెన్స్) పనుల కోసం మూతపడ్డాయి. దీనికి తోడు, ట్రాన్స్‌మిషన్ లైన్లలో కూడా మరమ్మతులు జరుగుతుండటంతో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి విద్యుత్ బదిలీపై పరిమితులు ఏర్పడ్డాయి. ఈ కారణాల వల్ల విద్యుత్ వ్యవస్థ రిజర్వ్ మార్జిన్‌కు దగ్గరగా పనిచేస్తుండటంతో గ్రిడ్‌పై తీవ్ర ఒత్తిడి నెలకొంది. అక్టోబర్ 13 నాటికి విద్యుత్ డిమాండ్ సుమారు 1,11,500 మెగావాట్లకు చేరుకుంటుందని పీజేఎం అంచనా వేసింది. ముఖ్యంగా మేరీల్యాండ్, వర్జీనియా, నార్త్ కరోలినా, వాషింగ్టన్ మెట్రోపాలిటన్ ప్రాంతాల్లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంటుందని భావించింది. దీంతో అప్రమత్తమైన పీజేఎం, గ్రిడ్ స్థిరత్వాన్ని కాపాడేందుకు అదనపు అధికారాలు కావాలని అక్టోబర్ 11న ఇంధన శాఖను అభ్యర్థించింది.

మోదీ కేబినెట్‌కు ఎల్ మురుగన్ రాజీనామా

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర సమాచార, ప్రసార, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి ఎల్. మురుగన్ తన పదవులకు రాజీనామా చేశారు. కేంద్ర మంత్రి పదవితో పాటు, తన రాజ్యసభ సభ్యత్వానికి కూడా ఆయన మంగళవారం రాజీనామా సమర్పించారు. తమిళనాడులో బీజేపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడం, 2029 లోక్‌సభ ఎన్నికల నాటికి పార్టీని సమాయత్తం చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాసినట్లు మురుగన్ వెల్లడించారు. "తమిళనాడుకు వెళ్లి పార్టీ కోసం పూర్తిస్థాయిలో పనిచేయాలన్న నా ఆకాంక్షను ప్రధాని మోదీకి లేఖ ద్వారా తెలియజేశాను. మంత్రిగా నా బాధ్యతల నుంచి, రాజ్యసభ సభ్యత్వం నుంచి నన్ను విముక్తుడిని చేయాలని కోరాను" అని ఆయన వివరించారు. ఇటీవల ప్రధాని మోదీ తమిళనాడు పర్యటనకు వచ్చినప్పుడు ప్రజల నుంచి లభించిన అపూర్వ ఆదరణ, ఉత్సాహం చూశాక తన నిర్ణయం మరింత బలపడిందని ఆయన పేర్కొన్నారు. తమిళనాడులోని ప్రతి గ్రామం, ప్రతి వీధిలో పర్యటించి ప్రజలను, పార్టీ కార్యకర్తలను కలుస్తానని, రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ ఉనికిని విస్తరింపజేస్తానని మురుగన్ తన లేఖలో పేర్కొన్నారు. 2029 లోక్‌సభ ఎన్నికల్లో తమిళనాడు నుంచి పార్టీకి మెరుగైన ఫలితాలు అందించడమే తన లక్ష్యమని ఆయన తెలిపారు. త్వరలో కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరగవచ్చనే ఊహాగానాల మధ్య మురుగన్ రాజీనామా రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది.

మహమ్మద్ యూనస్ టెర్రరిస్ట్

న్యూయార్క్‌లో బంగ్లా మాజీ చీఫ్‌కు అవమానం

న్యూయార్క్: బంగ్లాదేశ్ మాజీ తాత్కాలిక ప్రభుత్వ చీఫ్ అడ్వైజర్ మహమ్మద్ యూనస్‌కు అమెరికాలో చేదు అనుభవం ఎదురైంది. న్యూయార్క్‌లోని జాన్ ఎఫ్. కెన్నడీ (జేఎఫ్‌కే) అంతర్జాతీయ విమానాశ్రయంలో కొందరు బంగ్లాదేశ్ ప్రవాసులు ఆయనను అడ్డుకుని, తీవ్ర పదజాలంతో నిరసన వ్యక్తం చేశారు. యూనస్‌ను 'టెర్రరిస్ట్' అని సంబోధిస్తూ, బంగ్లాదేశ్‌లో వేలాది మంది మరణానికి ఆయనే కారణమని, అక్కడ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని ఘాటుగా ఆరోపించారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అక్టోబర్ 12న దోహా నుంచి ఖతార్ ఎయిర్‌వేస్ విమానంలో న్యూయార్క్ చేరుకున్న యూనస్‌ను, టెర్మినల్ 8 వద్దకు రాగానే కొందరు నిరసనకారులు చుట్టుముట్టారు. "నువ్వో ఉగ్రవాదివి, ఇక్కడికి ఎందుకు వచ్చావు? మా దేశంలో ప్రజాస్వామ్యాన్ని నాశనం చేశావు" అని ఒక నిరసనకారుడు ఆగ్రహం వ్యక్తం చేయడం వీడియోలో వినిపించింది. బంగ్లాదేశ్‌లో వేలాది మంది ప్రాణనష్టానికి ఆయనే బాధ్యుడని మరొకరు ఆరోపించారు. వీల్‌చైర్‌లో సిబ్బంది సహాయంతో విమానాశ్రయం వెలుపలికి వస్తున్న యూనస్‌ను నిరసనకారులు అడుగడుగునా నిలదీశారు. వేలాది మంది బంగ్లాదేశ్ పోలీసుల మరణానికి యూనస్ కారణమని ఆరోపిస్తూ, "గో బ్యాక్" అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

లడఖ్‌లోని 28 ప్రాంతాలకు పేర్లు ఖరారు

న్యూఢిల్లీ: లడఖ్‌లోని 28 వ్యూహాత్మక ప్రాంతాలకు కేంద్ర ప్రభుత్వం అధికారికంగా పేర్లు ఖరారు చేయడంపై చైనా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ చర్య చట్టవిరుద్ధమని చైనా ఆరోపించగా, భారత్ అత్యంత ఘాటుగా స్పందించింది. లడఖ్ భారత్‌లో విడదీయరాని అంతర్భాగమని, చైనా ఆరోపణలు ఈ వాస్తవాన్ని మార్చలేవని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, లడఖ్ యంత్రాంగంతో సంప్రదింపులు జరిపిన అనంతరం ఈ నిర్ణయం తీసుకుంది. శిఖరాలు, కనుమలు, జలపనరులతో సహా మొత్తం 28 ప్రదేశాలకు ప్రామాణిక పేర్లను నిర్ణయించి, వాటిని సర్వే ఆఫ్ ఇండియా అధికారిక మ్యాప్‌లో చేర్చనున్నారు. దీనివల్ల ఆయా ప్రాంతాలకు సంబంధించి స్పష్టమైన గుర్తింపు, అవగాహన పెరుగుతుందని విదేశాంగ శాఖ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. తన భౌగోళిక రికార్డులను పటిష్ఠం చేసుకునేందుకే భారత్ ఈ చర్యలు చేపట్టింది. దీనిపై చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి మావో నింగ్ స్పందిస్తూ, భారత్ ఏకపక్షంగా ఏర్పాటు చేసిన 'కేంద్రపాలిత ప్రాంతం లడఖ్'ను తాము ఎన్నడూ గుర్తించలేదని వ్యాఖ్యానించారు. "భారత్ ప్రకటించిన ప్రామాణిక పేర్లను మేము వ్యతిరేకిస్తున్నాం. ఈ చర్య చట్టవిరుద్ధం, చెల్లదు. చైనా-భారత్ సరిహద్దులోని పశ్చిమ సెక్టార్‌లోని ఆ ప్రాంతాలు ఎల్లప్పుడూ చైనా భూభాగాలే" అని ఆమె వాదించారు. చైనా వాదనలను భారత్ తీవ్రంగా ఖండించింది. "కేంద్రపాలిత ప్రాంతమైన లడఖ్ భారత్‌లో విడదీయరాని అంతర్భాగం. ఈ సుస్థిర వాస్తవాన్ని చైనా ఎంతగా వ్యతిరేకించినా మార్చలేదు" అని విదేశాంగ శాఖ తన ప్రకటనలో స్పష్టం చేసింది.

సీజేఐపై పోస్ట్.. సుమోటోగా విచారణ

న్యూఢిల్లీ: భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్‌ను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో పెట్టిన ఓ పోస్ట్, 'ఇండియా' కూటమి సుప్రీంకోర్టు వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమం తీవ్ర వివాదాస్పదంగా మారాయి. ఈ ఘటనలపై సుమోటోగా క్రిమినల్ కోర్టు ధిక్కరణ చర్యలు చేపట్టాలని కోరుతూ సుప్రీంకోర్టు న్యాయవాది వినీత్ జిందాల్, సీజేఐకి ఫిర్యాదు చేశారు. కేరళ కాంగ్రెస్ విభాగం తన 'ఎక్స్' ఖాతాలో, "ప్రియమైన సూర్యకాంత్, శాంతిభద్రతలు మీ పరిధిలో లేకపోతే రాజీనామా చేయండి. ఆ పని చేయగల వారిని మేం చూసుకుంటాం" అని పోస్ట్ చేసింది. తర్వాత దానిని తొలగించినప్పటికీ, ఈ పోస్ట్ న్యాయవ్యవస్థ గౌరవానికి భంగం కలిగించేలా ఉందని జిందాల్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు సాధారణ రాజకీయ విమర్శల పరిధిలోకి వస్తాయా లేక కోర్టు ధిక్కరణ చట్టం 1971, సెక్షన్ 2(ఎ) కిందకు వస్తాయా పరిశీలించాలని కోరారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 129 ప్రకారం కోర్టు ధిక్కరణను శిక్షించే అధికారం సుప్రీంకోర్టుకు ఉందని గుర్తుచేశారు. అలాగే, సోమవారం ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఇతర 'ఇండియా' కూటమి నేతలు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసే సమయంలో నిర్వహించిన నిరసన ప్రదర్శనపైనా విచారణ జరపాలని జిందాల్ అభ్యర్థించారు.

డ్రగ్స్‌పై పోరాటం.. లైవ్‌లోనే యాక్టివిస్ట్ కాల్చివేత!

చండీగఢ్: పంజాబ్‌లో తీవ్ర కలకలం రేపిన ఘటనలో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఓ సామాజిక కార్యకర్త దారుణ హత్యకు గురయ్యారు. పర్విందర్ సింగ్ జోతా అనే యాక్టివిస్ట్‌ను ఓ మెడికల్ షాపు యజమాని కాల్చి చంపాడు. ఈ దారుణం మొత్తం జోతా ఫేస్‌బుక్ ఖాతా నుంచి ప్రత్యక్ష ప్రసారం కావడం సంచలనం సృష్టిస్తోంది. ఈ ఘటన ఇవాళ ఉదయం పంజాబ్‌లోని మాన్సా పట్టణంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. కొన్ని సంవత్సరాలుగా డ్రగ్స్ మాఫియాకు వ్యతిరేకంగా పోరాడుతున్న పర్విందర్ సింగ్ జోతా, స్థానిక మెడికల్ షాపుల్లో సింథటిక్ డ్రగ్స్ అక్రమ అమ్మకాలను సోషల్ మీడియా లైవ్ వీడియోల ద్వారా బహిర్గతం చేస్తుంటారు. ఈ క్రమంలో ఈరోజు ఉదయం, అశ్వనీ కుమార్ అనే వ్యక్తికి చెందిన మెడికల్ షాపు వద్దకు వెళ్లారు. ఉదయం అదే షాపులో నిషేధిత మందులు కొనుగోలు చేశాడని చెబుతున్న ఓ వృద్ధుడిని కూడా ఆయన వెంట తీసుకెళ్లారు. డ్రగ్స్ అమ్మకాలపై యజమానిని నిలదీయడంతో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ వాగ్వాదాన్ని జోతా ఫేస్‌బుక్‌లో లైవ్ స్ట్రీమింగ్ చేస్తుండగా, యజమాని అశ్వనీ కుమార్ తుపాకీ బయటకు తీశాడు. అది చూసిన జోతా ఏమాత్రం భయపడకుండా, 'నన్ను చంపు' అంటూ అతడికి పలుమార్లు సవాలు విసిరాడు. దీంతో ఆగ్రహానికి గురైన అశ్వనీ కుమార్.. జోతాపై కాల్పులు జరిపాడు. పొట్ట, తొడ భాగంలోకి బుల్లెట్లు దూసుకెళ్లగా, ఒక బుల్లెట్ కాలేయాన్ని చీల్చడంతో జోతా అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు.



బాలికకు రోబో లైంగిక వేధింపులు

డర్బన్: జర్మనీలో ఓ వింత, దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. 16 ఏళ్ల బాలికపై ఓ రోబో లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు రావడం కలకలం రేపుతోంది. ఈ ఘటనను వీడియో తీసి, సోషల్ మీడియాలో లైవ్ స్ట్రీమింగ్ కూడా చేసినట్లు తెలిసింది. ఈ కేసుకు సంబంధించి ఇద్దరు యువకులపై పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేసి, రోబోను స్వాధీనం చేసుకున్నారు. కొలోన్ నగరంలోని హోహెన్‌జోలెర్న్‌రింగ్ వీధిలో ఆదివారం రాత్రి 11:45 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. ఓ ఫాస్ట్ ఫుడ్ రెస్టారెంట్ బయట తన స్నేహితులతో నిల్చుని ఉన్న బాలిక వద్దకు, వెనుక నుంచి సుమారు 1.2 మీటర్ల ఎత్తు ఉన్న రోబో వచ్చింది. ఆ రోబో బాలిక పిరుదులను తాకి, అసభ్యకరంగా ప్రవర్తించినట్లు పోలీసులు తెలిపారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అనుమానితులకు చెందిన కారు డిక్కీలో ఉన్న రోబోను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. రోబో యజమాని అయిన 16 ఏళ్ల యువకుడు, అతని 19 ఏళ్ల స్నేహితుడు కలిసి ఈ దారుణానికి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వారిద్దరి మొబైల్ ఫోన్లను కూడా సీజ్ చేశారు. ఈ ఘటనపై లైంగిక వేధింపుల అనుమానంతో క్రిమినల్ దర్యా

లయకారి చిత్రం





అది వాళ్ల కర్మ: అదితి రావు


దాదాపు రెండు పదుల కాలంగా చిత్రపరిశ్రమలో కొనసాగుతున్న అదితి రావు హైదరీ, ఈ ప్రత్యేకమైన మైలురాయి వద్దకు చేరుకుంటున్న వేళ తన సినీ ప్రయాణంపై స్పందిస్తూ పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. అక్టోబర్ 23న తన 40వ పుట్టినరోజు జరుపుకోబోతున్న అదితి.. విజయం, ఓటములతో సంబంధం లేకుండా తన ప్రయాణం సాగుతున్నట్లు తెలిపారు. నేర్చుకున్న పాఠాలు, స్పష్టత, కృతజ్ఞతా భావంతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. ఒకవేళ ఇప్పుడున్న తాను చిన్ననాటి తనను కలిస్తే, ఎలాంటి హడావుడి లేకుండా సంతోషంగా మనలా మనం ఉండమని సలహా ఇస్తానని అదితి చెప్పారు. బయట జరిగే విమర్శలను పట్టించుకోకుండా, మనల్ని ప్రోత్సహించే మంచి వాళ్లను నమ్మాలని అన్నారు. జీవితంలో ప్రతిదీ వెంటనే తెలిసిపోవాలని తొందరపడకూడదని, కొత్త విషయాలు నేర్చుకుంటూ ముందుకు వెళ్లాలని తెలిపారు. తప్పులు చేయడానికి ఎప్పుడూ భయపడకూడదని, ఆ తప్పుల నుంచే మనం మంచి పాఠాలు నేర్చుకుని గొప్పగా ఎదుగుతామని ఆమె వివరించారు. సినిమా రంగంలో తన ప్రయాణం ఎప్పుడూ అంత తేలిగ్గా సాగలేదని అదితి అన్నారు. ఎదురైన ఇబ్బందులను తలచుకుని బాధపడకుండా, ప్రతి అనుభవం తనకు ఎంతో నేర్పించిందని చెప్పడానికి సంతోషిస్తానని అన్నారు. ఇండస్ట్రీలో ఎదగడం కొండెక్కినంత కష్టంగా ఉంటుందని, కానీ ప్రతి అడుగు ముందుకు వేయడం వల్లనే అనుభవం వస్తుందని తెలిపారు.



పెళ్లి చేసుకోకున్నా పిల్లల్ని మాత్రం కనండి: నరేశ్

సీనియర్ నటుడు నరేశ్ పెళ్లి వ్యవస్థపై చేసిన కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్ ప్రధాన పాత్రల్లో నటించిన 'క్రేజీ కళ్యాణం' సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పెళ్లి చేసుకోవడంపై అడిగిన ప్రశ్నకు ఆయన తనదైన శైలిలో సమాధానమిచ్చారు. "ఈ కాలంలో పెళ్లి చేసుకున్నా, చేసుకోకపోయినా రెండూ సరైనవే. అలాగే లివింగ్ టుగెదర్ (సహజీవనం) కూడా కరెక్టే" అని నరేశ్ అభిప్రాయపడ్డారు. నేటి సమాజంలో వివాహాలు భారీ ఈవెంట్లుగా మారిపోయాయని, కోట్లు ఖర్చు చేసి పెళ్లి చేసుకుని, ఆ తర్వాత విడాకులకు కూడా అంతే ఖర్చు చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో చాలామంది యువకులకు పెళ్లి సంబంధాలు దొరకడం లేదని, అక్కడి పరిస్థితి దారుణంగా ఉందని ఆందోళన వెలిబుచ్చారు. అయితే, ఈ తరం వారు పెళ్లి చేసుకోవడం ఇష్టం లేకపోతే మానేయవచ్చని, కానీ పిల్లల్ని కనడం మాత్రం చాలా ముఖ్యమని నరేశ్ కుండబద్దలు కొట్టారు. బద్రప్ప గాజుల దర్శకత్వంలో తెరకెక్కిన 'క్రేజీ కళ్యాణం' చిత్రం పూర్తిగా పెళ్లి నేపథ్యంలో సాగే వినోదాత్మక చిత్రమని, ఇది అక్టోబర్ 16న థియేటర్లలోకి రానుందని చిత్రబృందం తెలిపింది. ఈ కార్యక్రమం వేదికగా నరేశ్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి.


రాకా కోసమే మృణాల్ త్యాగాలు?



అల్లు అర్జున్, అట్లీ కాంబోలో రూపొందుతున్న 'రాకా' సినిమాలో దీపికా పదుకునే మెయిన్ లీడ్‌గా నటిస్తున్న విషయం తెల్సిందే. రాకాలో దీపికా కాకుండా మరో ఇద్దరు ముగ్గురు హీరోయిన్స్ కూడా నటిస్తున్నారనే వార్తలు చాలా నెలలుగా వస్తున్నాయి. అయితే ఇప్పటి వరకు అట్లీ అండ్ టీం నుంచి ఎలాంటి క్లారిటీ రాలేదు. ముఖ్యంగా ఈ సినిమాలో మృణాల్ ఠాకూర్, రష్మిక మందన్న కీలక పాత్రల్లో కనిపించబోతున్నారనే వార్తలు జోరుగా వినిపిస్తున్నాయి. కానీ ఇప్పటి వరకు కన్ఫర్మేషన్ రాలేదు. సినిమాలో వారిద్దరి ప్రజెన్స్ దాదాపుగా కన్ఫర్మ్ అని అంతా అంటున్నారు. సినిమా విడుదల సమయంలో అయినా వీరి పాత్రల గురించి ఏమైనా క్లారిటీ వస్తుందేమో చూడాలి. అట్లీ సినిమా, అదీ అల్లు అర్జున్ నటిస్తున్న సినిమా కావడంతో రాకా పై అంచనాలు ఆకాశాన్ని తాకేలా ఉన్నాయి. కనుక మృణాల్ ఠాకూర్ చిన్న పాత్రలో కనిపించినా మంచి గుర్తింపు వస్తుందనే విశ్వాసంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఒక మీడియా చిట్‌చాట్‌లో మృణాల్ తన కొత్త ప్రాజెక్ట్‌ల గురించి స్పందించింది. కొత్తగా ఈ మధ్య కాలంలో సినిమాలకు ఓకే చెప్పలేదు. అంతకు ముందు కమిట్ అయిన సినిమాలనే చేస్తున్నాను. మంచి కథల కోసం వెయిట్ చేస్తున్నాను, తప్పకుండా ఈసారి మంచి కథతో, మంచి పాత్రతో రావాలని అనుకుంటున్నాను అని మృణాల్ చెప్పుకొచ్చింది. గత 9 నెలల్లో ఒక్క కొత్త సినిమాకు సైన్ చేయలేదని చెప్పిన మృణాల్ ఠాకూర్ 'రాకా' సినిమాలో నటించే విషయాన్ని కన్ఫర్మ్ చేయలేదు. అంతే కాకుండా రాకా సినిమాలో నటించడం లేదు అని కూడా చెప్పలేదు. అందుకే మృణాల్ ఠాకూర్ రానా సినిమాలో ఉందనే చాలా మంది బలంగా నమ్ముతున్నారు. ఇక 9 నెలలుగా కొత్త సినిమాలకు సైన్ చేయక పోవడం వెనుక 'రాకా' సినిమా ఉందేమో అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రాకా సినిమా తర్వాత మృణాల్ పాన్ ఇండియా సినిమాలపై ఫోకస్ పెట్టాలి అనుకుంటుందేమో అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

బాలీవుడ్‌లో కృతికి కలిసొచ్చేనా..?

'ఉప్పెన' సినిమాతో ఇండస్ట్రీకి వచ్చి బాక్సాఫీస్‌ను షేక్ చేసి, ఓవర్ నైట్ లోనే కుర్రకారు గుండెల్లో గూడు కట్టుకున్న క్యూట్ బ్యూటీ కృతి శెట్టి. ఆ తర్వాత తెలుగు, తమిళ భాషల్లో పలు చిత్రాల్లో నటించారు. అయితే వరుస అవకాశాలు దక్కించుకున్నప్పటికీ సరైన హిట్ అందుకోలేకపోయింది. ఇక ఇటీవల విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' సినిమాలో నటించిన ఈ ముద్దుగుమ్మ భారీ డిజాస్టర్‌ను చవిచూసింది. ప్రస్తుతం జయం రవి సరసన 'జీనీ' అనే భారీ చిత్రంలో నటిస్తున్నారు. ఇదిలా ఉంటే.. తాజాగా, కృతి శెట్టికి సంబంధించిన ఓ వార్త నెట్టింట చక్కర్లు కొడుతోంది. ఈ భామ, ఇప్పుడు బాలీవుడ్‌లోకి తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నట్లు టాక్. ఒక రొమాంటిక్ లవ్ స్టోరీతో హిందీ ఇండస్ట్రీలో అడుగుపెడుతున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్‌ను ప్రముఖ దర్శకుడు రోహిత్ శెట్టి వద్ద సుదీర్ఘ కాలం పాటు పని చేసిన విధి ఫోడ్దాంకర్ తెరకెక్కించనున్నారట.





అనుపమతో కలిసి నటించాలంటే భయమేసింది

'నవరసరాయ' డా. నరేష్ విజయ కృష్ణ, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, రాజ్ వెడ్స్ రాంబాయి ఫేమ్ అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'క్రేజీ కల్యాణం'. ఈ చిత్రాన్ని యారో సినిమాస్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెం. 2గా ప్యాషనేట్ ప్రొడ్యూసర్ బూసం జగన్ మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు బద్రప్ప గాజుల రూపొందిస్తున్నారు. దసరా పండుగ సందర్భంగా ఈ నెల 16న 'క్రేజీ కల్యాణం' సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా జరిగిన ఇంటర్వ్యూలో మూవీ హైలైట్స్ పంచుకున్నాడు యంగ్ హీరో అఖిల్ రాజ్. 'నేనెప్పుడూ మంచి కథలో, మంచి సినిమాలో నటుడిగా భాగం కావాలని కోరుకుంటాను. నా క్యారెక్టర్ నిడివి ఎంత అనేది చూసుకోను. ఈ సినిమాలో నా పాత్రకు ఎంత ఎనర్జీ, పర్ఫార్మెన్స్ కావాలో అంత ఇచ్చాను.

నితిన్ 'రుక్మిణి'లో ఆఫియా సయ్యద్



యంగ్ హీరో నితిన్ కొత్త సినిమా అలియాస్ రుక్మిణి నుంచి ఇంట్రెస్టింగ్ అప్డేట్ వచ్చింది. ఇన్నాళ్లూ ఆ సినిమాలో రుక్మిణి రోల్ లో ఎవరు నటిస్తున్నారనే సస్పెన్స్ ఉండగా.. రీసెంట్ గా దానికి చెక్ పడింది. బాలీవుడ్ నటి ఆఫియా సయ్యద్ ను ఆ మూవీ హీరోయిన్ గా పరిచయం చేస్తూ మేకర్స్ ఓ వీడియోను రిలీజ్ చేశారు. అయితే అందులో ఆమెను చూపించిన విధానం స్పెషల్ గా నిలిచింది. అందులో రుక్మిణి చాలా స్ట్రిక్ట్ టీచర్ గా కనిపిస్తోంది. నితిన్ హీరోగా నటిస్తున్న ఆ సినిమాను నేచురల్ స్టార్ నాని సమర్పిస్తున్నారు. యునానిమస్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై దీప్తి గంటా రూపొందిస్తున్నారు. దండోరా సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న మురళీకాంత్ దేవసోత్ ఆ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. డిసెంబర్ 4న ఆ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఇప్పుడు ఆఫియా సయ్యద్ ను రుక్మిణిగా ఇంట్రడ్యూస్ చేశారు మేకర్స్. ఆమె ఓ స్కూల్ లో టీచర్ గా కనిపించారు. అయితే మామూలు టీచర్ లా కాకుండా.. విద్యార్థులను డిసిప్లైన్ లో పెట్టే విషయంలో చాలా స్ట్రిక్ట్ గా ఉంటారు.



ఏఐతో నా న్యూడ్ ఫొటోలు చేస్తున్నారు: శ్రియ శరణ్

నటి శ్రియా శరణ్ ఏఐ మార్ఫింగ్- డిజిటల్ వేధింపులపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో మహిళలపై జరుగుతున్న ఈ డిజిటల్ వేధింపుల సంస్కృతిని తీవ్రంగా ఖండించారు. ఇటీవల నటి జాన్వీ కపూర్‌కు సంబంధించిన ఏఐ మార్ఫింగ్ వీడియో నెట్టింట తీవ్ర దుమారం రేపిన నేపథ్యంలో శ్రియా శరణ్ ఈ విషయంపై స్పందిస్తూ తన ఆవేదనను షేర్ చేసారు. ఇంటర్నెట్‌లో తన ఫొటోలను కూడా విపరీతంగా మార్ఫింగ్ చేస్తున్నారని, కొన్నిసార్లు ఆ ఫొటోల్లో ఉన్నది నిజంగా తానో కాదో కూడా గుర్తుపట్టలేనంతగా మార్చేస్తున్నారని శ్రియా వ్యాఖ్యానించారు. శరీర భాగాలను, వేసుకున్న దుస్తులను అసభ్యకర రీతిలో ఏఐ ద్వారా రీ-క్రియేట్ చేయడం అత్యంత విచారకరమని అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటి మార్ఫింగ్ ఫోటోలను కొందరు సరదాగా తీసుకున్నా.. అసలు అనుమతి లేకుండా మహిళల ఫోటోలను ఇలా మార్చడం ఏమాత్రం సరైనది కాదని శ్రియా ఆగ్రహించారు. ఏఐ టెక్నాలజీ వల్ల అనేక ఉపయోగకరమైన రంగాల్లో మేలు జరుగుతున్నా.. దానిని బాధ్యతారహితంగా ఉపయోగించినప్పుడు అత్యంత ప్రమాదకరమైన పరిస్థితులు దాపురిస్తాయని హెచ్చరించారు.



ఫిట్‌నెస్ ఉంటేనే
రో-కో ఉంటారు!

2027 వన్డే ప్రపంచకప్‌లో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఆడతారా? వయసు మీద పడుతున్న నేపథ్యంలో ఈ ఇద్దరు సీనియర్ల ఎంపికపై కొంతకాలంగా చర్చ సాగుతోంది. అయితే, వయసు ఒక్కటే ఆటగాడి ఎంపికకు ప్రాతిపదిక కాకూడదని బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్ స్పష్టం చేశారు.

ఫిట్‌నెస్, ప్రదర్శనే కీలకమని పేర్కొన్నారు. వచ్చే ఏడాది దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా వేదికలుగా ప్రపంచకప్ జరగనున్న విషయం తెలిసిందే. ప్రపంచకప్ జట్టు ఎంపికపై బీసీసీఐ నేరుగా వ్యాఖ్యానించలేదని మన్హాస్ తెలిపారు. తుది నిర్ణయం సెలెక్టర్లు, కోచ్‌లదేనని చెప్పారు. అయితే, తన అభిప్రాయం ప్రకారం ఆటగాడి ఫిట్‌నెస్, మైదానంలో ప్రదర్శనే ఎంపికకు ప్రామాణికాలని స్పష్టం చేశారు. జట్టు కోసం ఆడుతూ విజయాలు అందించే సత్తా ఉంటే వయసును అడ్డంకిగా చూడకూడదని అభిప్రాయపడ్డారు. వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు కోహ్లీ, రోహిత్, హార్దిక్ పాండ్యా వంటి అనుభవజ్ఞుల సహకారం ఎంతో ఉపయోగపడుతుందని మన్హాస్ అన్నారు. జస్‌ప్రీత్ బుమ్రా వంటి ఆటగాళ్లు బౌలింగ్ విభాగానికి నాయకత్వం వహించగలరని పేర్కొన్నారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ బాధ్యతలను సమర్థంగా పంచుకోవడం జట్టుకు మేలు చేస్తుందని చెప్పారు. ఒత్తిడిలో కీలక సందర్భాల్లో సత్తా చాటిన ఆటగాళ్లు జట్టులో ఉండటం మంచి కలయిక అని అభిప్రాయపడ్డారు. మాజీ భారత బ్యాటర్ మహమ్మద్ కైఫ్ సైతం ప్రపంచకప్‌పై తన అభిప్రాయాలను వెల్లడించారు. దక్షిణాఫ్రికాలో పిచ్‌లు గతంతో పోలిస్తే బ్యాటింగ్‌కు అనుకూలంగా మారాయని చెప్పారు. ఈ నేపథ్యంలో బౌలింగ్ విభాగం నాణ్యతే విజయాన్ని నిర్ణయిస్తుందని పేర్కొన్నారు. భారత్ ప్రపంచకప్ గెలవాలంటే బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాలను పటిష్ఠం చేసుకోవాలని సూచించారు. కోహ్లీ, రోహిత్ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు.



మళ్లీ ఒక్కటైన పృథ్వీ షా, ఆకృతి

భారత యువ క్రికెటర్ పృథ్వీ షా, నటి ఆకృతి అగర్వాల్ మళ్లీ ఒక్కటయ్యారు. తమ నిశ్చితార్థాన్ని రద్దు చేసుకుంటున్నట్లు ప్రకటించిన కొన్ని వారాలకే ఈ జంట తిరిగి కలిసిపోవాలని నిర్ణయించుకుంది. బయటి వ్యక్తుల అభిప్రాయాల ప్రభావంతో తాను తప్పుడు నిర్ణయం తీసుకున్నానని అంగీకరిస్తూ, ఆకృతి సోమవారం తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. 'ఒక వ్యక్తిగత వివరణ' పేరుతో ఆమె ఓ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. "మా బంధం గురించి మా కన్నా ఎక్కువగా ఇతరులకే తెలుసన్నట్లుగా మాట్లాడిన వారి మాటలు నన్ను ప్రభావితం చేశాయి. సరైన చర్చ లేకుండానే ఓ నిర్ణయానికి వచ్చేశాను" అని ఆకృతి ఆవేదన వ్యక్తం చేశారు. తన నిర్ణయం వల్ల కలిగిన బాధకు పూర్తి బాధ్యత తనదేనని ఆమె పేర్కొన్నారు. తామిద్దరం ఇప్పుడు అన్ని విషయాలు మాట్లాడుకుని, ఒకరినొకరు అర్థం చేసుకుని, కలిసి ప్రయాణించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. "మా భవిష్యత్తు మా నమ్మకం, ప్రేమపైనే ఆధారపడి ఉంటుంది. దయచేసి మా నిర్ణయాన్ని గౌరవించండి" అని ఆమె కోరారు. ఆకృతి చేసిన ఈ పోస్ట్‌ను పృథ్వీ షా తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పంచుకోవడం ద్వారా తన అంగీకారాన్ని తెలిపాడు. ఈ జంటకు 2026 మార్చిలో నిశ్చితార్థం జరగ్గా, వ్యక్తిగత లక్ష్యాలు, పరిస్థితులు వేరంటూ సెప్టెంబర్‌లో విడిపోతున్నట్లు ఆకృతి ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పుడు తమ మధ్య ఉన్న అపార్థాలను తొలగించుకుని కొత్తగా జీవితాన్ని ప్రారంభించాలని వారు నిర్ణయించుకున్నారు. 26 ఏళ్ల పృథ్వీ షా 2018లో భారత అండర్-19 జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి ప్రపంచకప్ అందించాడు. అరంగేట్రం చేసిన తొలి టెస్టులోనే సెంచరీతో సత్తా చాటాడు. అయితే, గాయాలు, ఫామ్ లేమి కారణంగా కొంతకాలంగా జాతీయ జట్టుకు దూరంగా ఉంటున్నాడు. ప్రస్తుతం దేశవాళీ క్రికెట్‌లో మహారాష్ట్ర తరఫున ఆడుతున్నాడు.



ప్లేయర్ ఆఫ్ ది మంత్..
గిల్

ఐదోసారి శుభ్‌మన్‌కు అవార్డు

మహిళల విభాగంలో రెండోసారి షెఫాలీ

భారత ఆటగాళ్లు శుభ్‌మన్ గిల్, షెఫాలీ వర్మ 'ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డులు గెలుచుకున్నారు. సెప్టెంబర్ 2026కు గానూ ప్రకటించిన పురుషుల విభాగంలో గిల్ ఈ పురస్కారాన్ని ఐదోసారి అందుకున్నాడు. మహిళల విభాగంలో షెఫాలీ రెండోసారి ఈ అవార్డును సొంతం చేసుకుంది.

ఆసియా కప్, ఆసియా క్రీడల్లో షెఫాలీ రాణించగా.. వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌లో గిల్ అదరగొట్టాడు. వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌లో గిల్ అద్భుత ప్రదర్శన చేశాడు. తిరువనంతపురంలో జరిగిన తొలి వన్డేలో 110 పరుగులు చేసి భారత్ విజయంలో కీలక పాత్ర పోషించాడు.

ఆ తర్వాతి మ్యాచ్‌లో 133 బంతుల్లో 223 పరుగులతో చెలరేగాడు. లక్ష్య ఛేదనలో అత్యంత వేగంగా డబుల్ సెంచరీ సాధించిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. 406 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత్ మరో 39 బంతులు మిగిలుండగానే ఛేదించింది. గతంలో 2023 జనవరి, సెప్టెంబర్, 2025 ఫిబ్రవరి, జులై నెలల్లో గిల్ ఈ అవార్డు అందుకున్నాడు. తాజా పురస్కారంతో ఐదుసార్లు ఈ ఘనత సాధించిన ఆటగాడిగా తన రికార్డును మరింత పదిలం చేసుకున్నాడు. వెస్టిండీస్ కెప్టెన్ హేలీ మాథ్యూస్ కూడా ఐదుసార్లు ఈ అవార్డును గెలుచుకున్నాడు. మహిళల విభాగంలో షెఫాలీ వర్మ తన బ్యాటింగ్ జోరుతో ఆకట్టుకుంది. ఆసియా కప్‌లో భారత్ విజయంలో కీలకంగా నిలిచింది. ఆ టోర్నీలో 360 పరుగులు సాధించడంతో పాటు ఆరు వికెట్లు పడగొట్టింది. 184.61 స్ట్రైక్‌రేట్‌తో పరుగులు చేసింది. ఆసియా క్రీడల్లోనూ షెఫాలీ సత్తా చాటింది. బంగ్లాదేశ్‌తో సెమీఫైనల్లో అజేయంగా 100 పరుగులు చేసింది. శ్రీలంకతో ఫైనల్లో 48 పరుగులు సాధించింది. గతేడాది నవంబరులో మహిళల వన్డే ప్రపంచకప్ ఫైనల్లో దక్షిణాఫ్రికాపై మ్యాచ్ గెలిపించే ఇన్నింగ్స్ ఆడినందుకు తొలిసారి ఈ అవార్డు అందుకుంది. ఒకే దేశానికి చెందిన ఆటగాళ్లు పురుషుల, మహిళల విభాగాల్లో ఒకేసారి అవార్డులు గెలవడం ఇది ఐదోసారి. భారత ఆటగాళ్లు ఇలా రెండు పురస్కారాలు అందుకోవడం ఇది మూడోసారి. 2024 జూన్‌లో జస్‌ప్రీత్ బుమ్రా, స్మృతి మంధాన.. 2025 సెప్టెంబర్‌లో అభిషేక్ శర్మ, స్మృతి మంధాన ఈ ఘనత సాధించారు. ప్రపంచవ్యాప్తంగా నమోదైన అభిమానుల ఓట్లు, మాజీ అంతర్జాతీయ ఆటగాళ్లు, మీడియా ప్రతినిధులతో కూడిన నిపుణుల కమిటీ నిర్ణయం ఆధారంగా విజేతలను ఎంపిక చేశారు.

రంజీ ట్రోఫీలో హైదరాబాద్ బోణీ

రంజీ ట్రోఫీలో హైదరాబాద్ జట్టు శుభారంభం చేసింది. టీమిండియా ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్ సారథ్యంలో బరిలోకి దిగిన హైదరాబాద్.. గ్రూప్-బి తొలి మ్యాచ్‌లో త్రిపురపై ఇన్నింగ్స్ 40 పరుగుల తేడాతో భారీ విజయాన్ని అందుకుంది. కేవలం మూడు రోజుల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ బౌలర్లు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించారు. హైదరాబాద్‌లోని జింఖానా గ్రౌండ్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన త్రిపుర, హైదరాబాద్ బౌలర్ల ధాటికి తొలి ఇన్నింగ్స్‌లో 134 పరుగులకే కుప్పకూలింది. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ అనికేత్ రెడ్డి 5 వికెట్లతో చెలరేగగా, తనయ్ త్యాగరాజన్ 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన హైదరాబాద్, ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (54), రుతిక్ యాదవ్ (61), రాహుల్ రదేశ్ (40), చామ మిలింద్ (40) రాణించడంతో తొలి ఇన్నింగ్స్‌లో 294 పరుగులు చేసి కీలక ఆధిక్యాన్ని సంపాదించింది. రెండో ఇన్నింగ్స్‌లోనూ త్రిపుర బ్యాటర్లు చేతులెత్తేశారు. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ తనయ్ త్యాగరాజన్ ఈసారి 6 వికెట్లతో త్రిపుర పతనాన్ని శాసించాడు. కెప్టెన్ సిరాజ్ రెండు కీలక వికెట్లు తీయడంతో త్రిపుర 120 పరుగులకే ఆలౌటైంది. దీంతో హైదరాబాద్ జట్టు ఇన్నింగ్స్ 40 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మ్యాచ్ మొత్తంలో 9 వికెట్లు తీసిన తనయ్ త్యాగరాజన్ హీరోగా నిలిచాడు. ఇదిలా ఉండగా, ఇతర గ్రూప్ మ్యాచ్‌లలో ఉత్తరప్రదేశ్, ముంబై జట్లు సైతం భారీ ఇన్నింగ్స్ విజయాలను తమ ఖాతాలో వేసుకున్నాయి. రాజ్‌గిర్‌లో జరిగిన మ్యాచ్‌లో ఉత్తరప్రదేశ్.. బీహార్‌పై ఇన్నింగ్స్ 267 పరుగుల తేడాతో గెలిచింది.

ఢిల్లీ క్యాపిటల్స్‌లో యువీ డబుల్ రోల్

టీమిండియా మాజీ ఆల్ రౌండర్ యువరాజ్ సింగ్ తన కెరీర్‌లో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించబోతున్నాడు. రాబోయే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2027 సీజన్ కోసం ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు అసిస్టెంట్ కోచ్ గా, బ్యాటింగ్ కోచ్‌గా నియమితుడయ్యాడు. ఈ మేరకు ఫ్రాంచైజీ మంగళవారం అధికారికంగా ప్రకటించింది. కోచ్‌గా యువరాజ్‌కు ఇదే తొలి అధికారిక బాధ్యత కావడం విశేషం. ఈ నియామకంతో యువరాజ్ సింగ్ మళ్లీ ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుతో తన అనుబంధాన్ని పునరుద్ధరించుకున్నాడు. గతంలో 2015 ఐపీఎల్ సీజన్‌లో (అప్పుడు ఢిల్లీ డేర్‌డెవిల్స్) యువరాజ్‌ను ఫ్రాంచైజీ రికార్డు స్థాయిలో రూ.16 కోట్లకు కొనుగోలు చేసింది. ఆ సమయంలో ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన ఆటగాడిగా యువీ నిలిచాడు. ఆ సీజన్‌లో ఢిల్లీ తరఫున 14 మ్యాచ్‌లూ ఆడాడు. ఈ కొత్త బాధ్యతలపై యువరాజ్ సింగ్ స్పందిస్తూ, "ఢిల్లీ క్యాపిటల్స్‌తో నా జీవితంలో కొత్త ప్రయాణం ప్రారంభించడం చాలా ఆనందంగా ఉంది. ఈ ఫ్రాంచైజీతో నాకు పాత అనుబంధం ఉంది. యాజమాన్యం కూడా బాగా తెలుసు. ఇది నాకు దక్కిన ప్రత్యేక అవకాశం. ఈసారి హెడ్ కోచ్ 'దాదా' (సౌరవ్ గంగూలీ)తో కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నాను. కోచింగ్ అంటే నాకు చాలా ఇష్టం. ప్రతిభావంతులతో కూడిన ఈ జట్టుతో పనిచేయడానికి ఆసక్తిగా ఉన్నాను.



12 రోజుల్లో కోటిన్నర దరఖాస్తులు

హాట్ కేక్‌ల్లా వరల్డ్ కప్ 2027 టికెట్లు

2027లో జరగనున్న ఐసీసీ పురుషుల క్రికెట్ ప్రపంచకప్‌పై అభిమానుల్లో అప్పుడే అంచనాలు ఆకాశాన్నంటాయి. టోర్నీ ఆరంభానికి ఇంకా ఏడాదికి పైగా సమయం ఉన్నప్పటికీ, టికెట్ల కోసం ప్రపంచవ్యాప్తంగా అనూహ్య స్పందన లభిస్తోంది. టికెట్ బ్యాలెట్ ప్రక్రియ ప్రారంభమైన కేవలం 12 రోజుల్లోనే ఏకంగా 1.5 కోట్లకు పైగా దరఖాస్తులు రావడం క్రికెట్ అభిమానుల్లో నెలకొన్న ఉత్సాహానికి నిదర్శనంగా నిలుస్తోంది. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు ఈ మెగా టోర్నీకి సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఐసీసీ వెల్లడించిన వివరాల ప్రకారం.. 142 దేశాల నుంచి అభిమానులు టికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటివరకు మొత్తం 1,50,83,752 టికెట్ దరఖాస్తులు రాగా, 44,23,417 బ్యాలెట్ రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి. రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలైన మొదటి వారంలోనే 10 లక్షల దరఖాస్తులు రాగా, ఆ తర్వాత అనూహ్యంగా ఈ సంఖ్య పెరిగింది. దాదాపు 24 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఈ మెగా టోర్నీ ఆఫ్రికా గడ్డపై జరగనుండటం విశేషం. అంతేకాకుండా, నూతన ఫార్మాట్‌లో జరగనున్న ఈ 14వ ఎడిషన్‌ను క్రికెట్ చరిత్రలోనే అతిపెద్ద ఈవెంట్‌గా నిర్వహించాలని నిర్వాహకులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ అనూహ్య స్పందనపై ఐసీసీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సంజోగ్ గుప్తా మాట్లాడారు. "ప్రపంచకప్ టోర్నీకి ఉన్న ప్రతిష్ఠ, ఆతిథ్య దేశాలుగా ఆఫ్రికా దేశాలకు ఉన్న ఆకర్షణ, టోర్నీకి ముందు ఐసీసీ చేపట్టిన ప్రచార కార్యక్రమాలే ఈ భారీ స్పందనకు కారణం. ఇది మాకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తోంది" అని వివరించారు. టోర్నీకి ఇంకా ఏడాది సమయం ఉన్నందున, రానున్న రోజుల్లో 360 డిగ్రీల యాక్టివేషన్లు, వివిధ వేదికల ద్వారా ప్రచార కార్యక్రమాలతో అభిమానుల్లో ఉత్సాహాన్ని మరింత పెంచుతామని ఆయన తెలిపారు. అభిమానులు టికెట్ల బ్యాలెట్ కోసం రిజిస్టర్ చేసుకునేందుకు 2026 నవంబర్ 21 చివరి తేదీగా నిర్ణయించారు. సరిగ్గా ఏడాది తర్వాత అంటే 2027 నవంబర్ 21న జొహన్నెస్‌బర్గ్‌లోని వాండరర్స్ స్టేడియంలో ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఈ టోర్నమెంట్ 2027 అక్టోబర్ 2న నమీబియాలోని విండ్‌హోక్‌లో మూడు జట్ల సూపర్ సిరీస్‌తో ప్రారంభం కానుంది. మొత్తం మీద టోర్నీ ఆరంభానికి ముందే టికెట్లకు ఈ స్థాయిలో డిమాండ్ రావడం, ఈ మెగా ఈవెంట్‌పై ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆసక్తిని స్పష్టం చేస్తోంది.

ఈవార్తలు
ప్రజావాణి
బుధవారం 14-10-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు

నేటి ఈవార్తలు **సంపాదకీయం** Editorial

వైద్యం ఖర్చు ముందే తెలియాలి!

వైద్యం మనిషి ప్రాథమిక అవసరం. అనారోగ్యంతో ఆసుపత్రి గుమ్మం తొక్కిన వ్యక్తికి కావాల్సింది నాణ్యమైన చికిత్స, ప్రాణాలను కాపాడే భరోసా. కానీ నేటి పరిస్థితుల్లో అనారోగ్యంతో పాటు ఆసుపత్రి ఖర్చుల భయం కూడా రోగిని వెంటాడుతోంది. చికిత్స ప్రారంభించే ముందు ఒక అంచనా.. బిల్లు చేతికి వచ్చేసరికి మరో లెక్క! మందులు, పరీక్షలు, వైద్యుల రుసుములు, పడక ఖర్చులు, ఇతర సేవల పేర్లతో పెరిగే బిల్లులు సామాన్య కుటుంబాల ఆర్థిక స్థితిని కుదేలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రైవేటు వైద్య సేవల ఖర్చులను ప్రకటించాలన్న కేంద్ర ప్రభుత్వ ఆదేశం ప్రజలకు ఎంతవరకు ఊరటనిస్తుందన్నది కీలక ప్రశ్న. ప్రైవేటు ఆసుపత్రులు అందించే వైద్య సేవలకు ధరలు ఉండటం తప్పు కాదు. ఆధునిక పరికరాలు, నిపుణులైన వైద్యులు, శిక్షణ పొందిన సిబ్బంది, నిర్వహణ కోసం ఖర్చులు అవసరమే. అయితే ఆ ఖర్చుల పేరుతో రోగికి ముందుగా స్పష్టత ఇవ్వకుండా, చికిత్స పూర్తయ్యాక ఊహించని మొత్తాలతో బిల్లు చేతిలో పెట్టడం ఎంతవరకు సమంజసం? సేవకు ధర నిర్ణయించడం ఒక అంశమైతే, ఆ ధరను రోగికి ముందే తెలియజేయడం మరో కీలక బాధ్యత. ఈ రెండింటి మధ్య పారదర్శకతే వారధిగా ఉండాలి. ఒక మధ్యతరగతి కుటుంబంలో ఎవరైనా అకస్మాత్తుగా అనారోగ్యానికి గురైతే, చికిత్స కోసం డబ్బు ఎలా సమకూర్చాలన్నదే మొదటి సమస్యగా మారుతోంది. పొదుపు సొమ్ము ఖర్చు చేయడం, బంగారం తాకట్టు పెట్టడం, అప్పులు చేయడం.. ఇలా అనేక కుటుంబాలు ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఆరోగ్య బీమా ఉన్నవారికి అన్ని చికిత్సలు, మందులు, పరీక్షలు పూర్తిగా పరిధిలోకి వస్తాయన్న హామీ లేదు. బీమా పరిమితులు, మినహాయింపులు, అనుమతుల ప్రక్రియ కూడా కొన్నిసార్లు భారంగా మారుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఏ చికిత్సకు ఎంత ఖర్చవుతుంది? వైద్యుల రుసుము ఎంత? గది అద్దె, పరీక్షలు, మందులు, శస్త్రచికిత్స, ఇతర సేవలకు ఎంత చెల్లించాలి? అదనపు ఖర్చులు వచ్చే అవకాశాలేమిటి? వంటి వివరాలు ముందుగానే అందుబాటులో ఉంటే కుటుంబాలు తమ ఆర్థిక పరిస్థితికి అనుగుణంగా నిర్ణయం తీసుకోగలవు. అత్యవసర పరిస్థితుల్లో ధరల గురించి బేరమాడే అవకాశం ఉండకపోవచ్చు. అయినప్పటికీ సాధారణ చికిత్సలు, ముందుగా నిర్ణయించగల శస్త్రచికిత్సల విషయంలో ఖర్చుల వివరాలను స్పష్టంగా తెలియజేయడం రోగి హక్కుగా మారాలి.

రైతుకు భరోసా ఏది?

రైతు పొలంలో నిలబడి ఆకాశం వైపు చూస్తున్నాడు. మబ్బులు కమ్ముకుంటాయేమోనని కాదు.. తన కష్టం వృథా కాకుండా వరుణుడు కరుణిస్తాడేమోనని! విత్తనం వేయడానికి అప్పు చేశాడు. ఎరువులు కొన్నాడు. కూలీలతో పనులు చేయించాడు. పంట చేతికొచ్చే సమయానికి నీటి కొరత వెంటాడుతోంది. బోరు మోటారు నడవాలంటే విద్యుత్ కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. ఒకవైపు వర్షాభావం.. మరోవైపు సాగునీటి అనిశ్చితి.. ఇంకోవైపు పెట్టుబడి భారం. ఇన్ని కష్టాల మధ్య అన్నదాతకు భరోసా ఇవ్వాల్సిన పాలక వ్యవస్థ మాత్రం సమీక్షలు, సమావేశాలు, ప్రకటనల చుట్టూ తిరిగితే ఎలా? తెలంగాణలో ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితులు వ్యవసాయ రంగానికి సవాలుగా మారుతున్నాయి.



భారత వాతావరణ శాఖ గణాంకాలను ఉటంకిస్తూ వెలువడిన నివేదికల ప్రకారం, ఈ ఏడాది నైరుతి రుతుపవనాల కాలంలో రాష్ట్రానికి సాధారణంగా కురవాల్సిన 740.6 మిల్లీమీటర్ల వర్షానికి బదులుగా 615.5 మిల్లీమీటర్ల వర్షపాతమే నమోదైంది. అంటే 17 శాతం లోటు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 18 జిల్లాలు సాధారణం కంటే తక్కువ వర్షపాతాన్ని ఎదుర్కొన్నాయి. సుమారు 235 మండలాల్లో కరువు ఛాయలు కనిపిస్తున్నాయని అక్టోబర్ 9న వెలువడిన నివేదిక పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా వేలాది చిన్న నీటివనరుల్లో నీటి నిల్వలు తగ్గిపోవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. అక్టోబర్ 3 నాటికి పర్యవేక్షణలో ఉన్న 21,500 చెరువుల్లో 17,677 చెరువుల నీటి నిల్వలు వాటి సామర్థ్యంలో సగం కంటే తక్కువగా ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. ఇవి కేవలం గణాంకాలు కావు. పొలంలో పంటకు నీరు అందుతుందో లేదో తెలియక ఆందోళన చెందుతున్న రైతు పరిస్థితికి అద్దం పట్టే వివరాలు. సాధారణ వర్షపాత వర్గీకరణలో రాష్ట్రం ఉన్నంత మాత్రాన ప్రతి ప్రాంతంలో వ్యవసాయానికి సరిపడా నీరు ఉందని భావించలేం. ఎప్పుడు వర్షం పడింది? ఎక్కడ పడింది? ఎంత విస్తీర్ణంలో పంట సాగైంది? చెరువులు, ప్రాజెక్టుల్లో ఎంత నీరు నిల్వ ఉంది? భూగర్భ జలాల పరిస్థితి ఏమిటి? అనే అంశాలన్నీ వ్యవసాయాన్ని ప్రభావితం చేస్తాయి. రాష్ట్రస్థాయి సగటు వర్షపాతం రైతు పొలంలో పరిస్థితిని పూర్తిగా వివరించలేదు. ఇలాంటి సమయంలో ప్రభుత్వం చేయాల్సింది ఏమిటి? పరిస్థితిని సమీక్షించడం అవసరమే. అధికారులను అప్రమత్తం చేయడమూ అవసరమే. కానీ అవి సమస్య పరిష్కారానికి తొలి మెట్టు మాత్రమే. సమీక్షలో తీసుకున్న నిర్ణయం క్షేత్రస్థాయిలో అమలైనప్పుడే దానికి సార్థకత ఉంటుంది. రైతుకు అవసరమైన సమయంలో నీరు అందకపోతే, పంట కీలక దశలో విద్యుత్ సరఫరా నిలిచిపోతే, నష్టపోయిన రైతుకు పరిహారం అందకపోతే.. ఎన్ని సమావేశాలు నిర్వహించినా ప్రయోజనం ఏమిటి? కార్యాచరణ ప్రణాళిక ఎప్పుడు పూర్తవుతుంది? ఏ జిల్లాలో ఏ పంటకు ఎంత నీరు అవసరం? అందుబాటులో ఉన్న నీటిని ఎలా పంపిణీ చేస్తారు? విద్యుత్ సరఫరాలో అంతరాయాలు రాకుండా ఏ ఏర్పాట్లు చేస్తున్నారు? పంటలు ఎండిపోతున్న ప్రాంతాలను గుర్తించి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నారా? ఈ ప్రశ్నలకు సమాధానాలు క్షేత్రస్థాయిలో కనిపించాలి.

వ్యవసాయ విద్యుత్ సరఫరాపై రైతుల ఆందోళనలు ఈ పరిస్థితిని మరింత ఆందోళనకరంగా మారుస్తున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరులో అక్టోబర్ 9న రైతులు విద్యుత్ అంతరాయాలు, సాగునీటి కొరతపై నిరసన తెలిపారు. కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను సకాలంలో మార్చడం లేదని, పంటలను కాపాడేందుకు సరిపడా విద్యుత్ అందడం లేదని వారు ఆరోపించారు. ఈ నిరసనకు బీఆర్ఎస్ మద్దతు తెలిపింది. ఇవి స్థానిక రైతులు, ప్రతిపక్షం చేసిన ఆరోపణలు. వాటి తీవ్రతను అధికారికంగా పరిశీలించి వాస్తవాలను వెల్లడించాల్సిన బాధ్యత విద్యుత్ శాఖకు ఉంది. రైతుకు విద్యుత్ అంటే కేవలం ఒక సౌకర్యం కాదు. పంట బతుకుతుందా, ఎండిపోతుందా అన్నది నిర్ణయించే కీలక వనరు. బోరు ఉన్నా విద్యుత్ లేకపోతే నీరు తోడలేడు. నీరు ఉన్నా పంపు పనిచేయకపోతే పంటకు అందించలేడు. విద్యుత్ ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితిలో మోటార్లను నడపడం, వ్యవసాయ పనులను ప్రణాళికాబద్ధంగా కొనసాగించడం కష్టమవుతుంది. అందుకే వ్యవసాయ విద్యుత్ సరఫరాపై స్పష్టమైన షెడ్యూల్, అంతరాయాలపై తక్షణ స్పందన, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లకు వేగంగా మరమ్మతులు, క్షేత్రస్థాయి పర్యవేక్షణ అవసరం. విద్యుత్ కొరత లేదని ప్రభుత్వం చెబుతుంటే రైతుల నిరసనలు ఎందుకు వస్తున్నాయి? సరఫరా సక్రమంగా ఉందని అధికారులు నివేదిస్తుంటే కొన్ని ప్రాంతాల్లో రైతులు ఎందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు? ప్రతిపక్షం ఆరోపణలు చేస్తోందని కొట్టిపారేయడం ఎంత తప్పో, ప్రతిపక్షం చెప్పిన ప్రతి విషయాన్ని నిర్ధారణ లేకుండా వాస్తవంగా పరిగణించడం కూడా అంతే తప్పు. ప్రభుత్వం సరఫరా చేసిన గంటల వివరాలు, ఉపకేంద్రాల రికార్డులు, అంతరాయాల కారణాలు, మరమ్మతులపై గణాంకాలను ప్రజల ముందుంచాలి. అప్పుడు నిజానిజాలు తేలుతాయి. సాగునీటి విషయంలోనూ ఇదే జవాబుదారీతనం అవసరం. భారీ ప్రాజెక్టుల నిర్మాణం, ఎత్తిపోతల పథకాలపై వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయడం ఒక ఎత్తయితే, వాటి ద్వారా సాగుకు నీరు అందించడం మరో ఎత్తు. నీటిని నిల్వ చేయడం, అవసరమైన సమయంలో ఎత్తిపోసి పంటలకు అందించడం, కాలువల నిర్వహణ, చెరువుల పునరుద్ధరణ, భూగర్భ జలాల పరిరక్షణ.. ఇవన్నీ ఒకే ప్రణాళికలో భాగం కావాలి. ఏటా వర్షాలు తగ్గినప్పుడు మాత్రమే నీటి సమస్య గుర్తుకొస్తే, ప్రాజెక్టుల నిర్మాణం వెనుక ఉన్న అసలు లక్ష్యం నెరవేరినట్లా?

శశిధర్ అక్కెల



ఎండలకంటే ముందే మేల్కొంటారా?

మే సవి రాకముందే నీటి సమస్యపై చర్చ మొదలవుతుంది. ఎండలు ముదిరితే తాగునీటి కోసం ప్రజల పాట్లు మొదలవుతాయి. బోర్లు ఎండిపోతాయి. చెరువులు వెలవెలబోతాయి. సాగునీరు అందక పంటలు వాడిపోతాయి. పట్టణాల్లో ట్యాంకర్ల కోసం ఎదురుచూపులు.. గ్రామాల్లో నీటి కోసం మైళ్ల దూరం ప్రయాణాలు.. ఇదీ ప్రతి ఏడాది కనిపించే దృశ్యం. వర్షాభావం ఎదురైనప్పుడల్లా ప్రభుత్వాలు సమీక్షలు నిర్వహిస్తాయి. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని ప్రకటిస్తాయి. కానీ వేసవి ముగిసిన తర్వాత ఆ సమస్యను మళ్లీ మరిచిపోతాయి. తదుపరి వేసవి వచ్చే వరకు శాశ్వత పరిష్కారాలపై దృష్టి పెట్టవు. ఈ చక్రం ఎన్నాళ్లు? ఎండలు ముదిరాక మేల్కొనే పాలనకు బదులుగా.. ఎండలు రాకముందే సిద్ధమయ్యే పాలన ఎప్పుడు వస్తుంది? వాతావరణ మార్పులు ప్రపంచవ్యాప్తంగా నీటి భద్రతకు సవాలుగా మారుతున్నాయి. ఉష్ణోగ్రతలు పెరగడం, వర్షపాతంలో అస్థిరత, కొద్ది సమయంలోనే భారీ వర్షాలు కురవడం, ఆ తర్వాత సుదీర్ఘ విరామాలు ఏర్పడటం వంటి పరిణామాలు జలవనరుల నిర్వహణను సంక్లిష్టం చేస్తున్నాయి. ఎల్‌నినో వంటి వాతావరణ పరిణామాలు కొన్ని సందర్భాల్లో వర్షపాతంపై ప్రభావం చూపవచ్చు. అయితే వాటి ప్రభావం ప్రతి ప్రాంతంలో ఒకేలా ఉండదు. అందువల్ల వర్షాలు కురుస్తాయని ఆశపడటమో, కురవవని భయపడటమో కాకుండా అందుబాటులో ఉన్న నీటిని అంచనా వేసుకుని ప్రణాళికలు సిద్ధం చేసుకోవడమే ప్రభుత్వాల ముందున్న అసలు కర్తవ్యం. రాబోయే వేసవిలో ఎంత నీరు అవసరం? ప్రస్తుతం జలాశయాల్లో నిల్వలు ఎంత ఉన్నాయి? భూగర్భ జలాల పరిస్థితి ఏమిటి? ఏ ప్రాంతాల్లో తాగునీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉంది? వీటిపై సమగ్ర అంచనాలు సిద్ధం చేయాలి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు నీటి నిర్వహణ అత్యంత కీలకం. ఒకవైపు వ్యవసాయం, మరోవైపు వేగంగా విస్తరిస్తున్న పట్టణాలు, పరిశ్రమలు, పెరుగుతున్న జనాభా.. ఇలా అన్ని రంగాలకూ నీటి అవసరం పెరుగుతోంది. హైదరాబాద్ వంటి మహానగరాల్లో తాగునీటి డిమాండ్ పెరుగుతుండగా, గ్రామీణ ప్రాంతాల్లో బోర్లు, స్థానిక చెరువులపై ఆధారపడే కుటుంబాలు నీటి లభ్యతపై ఆందోళన చెందుతున్నాయి. సాగునీటి కోసం ప్రాజెక్టులపై ఆధారపడే రైతులకు కూడా జలాశయాల్లో నీటి నిల్వలు కీలకం. ఈ పరిస్థితుల్లో నీటిని కేవలం ఒక శాఖకు సంబంధించిన అంశంగా చూడటం సరికాదు. తాగునీరు, సాగునీరు, పారిశ్రామిక అవసరాలు, పర్యావరణ పరిరక్షణ.. అన్నింటినీ సమన్వయం చేసే సమగ్ర జలవిధానం అవసరం. ప్రభుత్వాలు మొదటగా చేయాల్సింది నీటి లభ్యతపై పారదర్శకమైన లెక్కలు ప్రజల ముందుంచడం. ప్రధాన జలాశయాల్లో ఎంత నీరు ఉంది? గత ఏడాదితో పోలిస్తే నిల్వలు ఎలా ఉన్నాయి? తాగునీటి అవసరాలకు ఎంత నీరు కేటాయించాలి? సాగునీటి సరఫరాకు ఎంత అవకాశం ఉంది? నీటి కొరత ఎదురయ్యే ప్రాంతాలేవి? ఈ వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. సంక్షోభం ముదిరిన తర్వాత ఆగమేఘాలపై నిర్ణయాలు తీసుకోవడం కంటే ముందుగానే పరిస్థితిని వివరించి ప్రజలను అప్రమత్తం చేయడం మెరుగైన పాలనకు నిదర్శనం. నీటి పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు ప్రభుత్వ విభాగాలు కూడా తమ బాధ్యతను నిరూపించుకోవాలి. నీటి సమస్యకు పరిష్కారం చూపడంలో చెరువుల పాత్రను విస్మరించలేం. ఒకప్పుడు గ్రామీణ జీవనానికి ఆధారంగా నిలిచిన చెరువులు, కుంటలు క్రమంగా ఆక్రమణలకు గురవుతున్నాయి. పూడికతో నీటి నిల్వ సామర్థ్యాన్ని కోల్పోతున్నాయి. వర్షం పడినప్పుడు నీటిని నిల్వ చేసుకునే అవకాశాలు తగ్గిపోతున్నాయి. పట్టణాల్లో వర్షపు నీరు వరదగా మారి రోడ్లపై ప్రవహించి చివరకు వృథాగా వెళ్లిపోతోంది. కొన్ని రోజుల తర్వాత అదే ప్రాంతాల్లో నీటి కొరత ఏర్పడుతోంది. ఈ వైరుధ్యాన్ని తొలగించాలంటే వర్షపు నీటిని నిల్వ చేసే వ్యవస్థలను బలోపేతం చేయాలి. చెరువుల పునరుద్ధరణ, కాలువల మరమ్మతులు, చెక్‌డ్యామ్‌ల నిర్వహణ, భూగర్భ జలాల పునరుద్ధరణకు ప్రాధాన్యం ఇవ్వాలి. కొత్త నిర్మాణాలకే నిధులు కేటాయించడం కాకుండా ఉన్న జలవనరులను కాపాడుకోవడంపైనా ప్రభుత్వాలు దృష్టి పెట్టాలి.



శ్రీకాంత్ చుక్కల
నిజామాబాద్

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811.
Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.